PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 243 | విజయవాడ, ఆదివారం 7 ఏప్రిల్ 2024 | 6 +8 పేజీలు + స్నేహ వెల : 7.00
Vol No | Vijayawada, Sunday 7 April 2024 | Rs

గాజాపై ఇజ్రాయిల్ యుద్ధోన్మాదానికి ఆరు నెలలు

- వేలల్లో మరణాలు, అంచనాలకు అందని విధ్వంసం
- ఇజ్రాయిల్ దాడులపై సర్వత్రా ఆందోళన
- కాల్పుల విరమణపై కైరోలో నేడు చర్చలు

5



బాదేసిన బట్లర్, సంజు

- బెంగళూరుపై రాజస్తాన్ ఘన విజయం
- కోహ్లి రికార్డు సెంచరీ వృథా

6

బిజెపి కుట్రలు అడ్డుకుంటాం

రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుంటాం

- తుక్కుగూడ జనజాతరలో రాహుల్‌గాంధీ
- కాంగ్రెస్ పార్టీ తెలుగు మేనిఫెస్టో ఆవిష్కరణ
- దేశంలో ప్రతి పేద మహిళకు, నిరుద్యోగికి ఏడాదికి లక్ష ఆర్థిక సాయానికి హామీ



తెలంగాణ కాంగ్రెస్ ఆధ్వర్యాన తుక్కుగూడలో జరిగిన జనజాతర బహిరంగ సభలో అభివాదం చేస్తున్న రాహుల్‌గాంధీ, సిఎం రేవంత్‌రెడ్డి తదితరులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశ ప్రజల మధ్య మతవిద్వేషాలు రెచ్చగొట్టే బిజెపి రాజకీయ కుట్రలను అడ్డుకొంటామని కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ అన్నారు. టిపిసిసి ఆధ్వర్యంలో హైదరాబాద్ శివారు తుక్కుగూడలో శనివారం తెలంగాణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో జరిగిన జనజాతర బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. అంతకుముందు కాంగ్రెస్ నాయకులు కెసి వేణు గోపాల్, దీప్‌దాస్‌మున్షి, తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి, మంత్రులు, ఇతర నాయకులతో కలిసి కాంగ్రెస్ మేనిఫెస్టో 'పాంచ్ న్యాయ్ 'తెలుగు పోస్టర్‌ను రాహుల్ ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ రాజ్యాంగం, ప్రజాస్వామ్యాన్ని కాపాడతామని, మోడీ ఆటలు సాగనీయబోమని అన్నారు. దేశ జనాభాలో 90శాతం ఉన్న బిసి, ఎస్‌సి, ఎస్‌టి, ,మైనార్టీ, పేద వర్గాలకు బడ్జెట్‌లో కేవలం ఆరు శాతం మాత్రమే ఖర్చు చేస్తున్నారని రాహుల్ పేర్కొన్నారు. కాంగెస్ మేనిఫెస్టోను ఆయన దేశ ప్రజల ఆత్మగా అభివర్ణించారు. దేశంలో ప్రతి నిరుద్యోగ యువతకు ఏడాది పాటు ఆయా రంగాల్లో శిక్షణ ఇచ్చి లక్ష రూపాయల జీతం అందజేస్తామని రాహుల్ హామీ ఇచ్చారు.

ప్రతి పేద కుటుంబంలో మహిళకు లక్ష రూపాయలు ఆర్థిక సహాయం అందజేస్తామన్నారు. మోడీ ప్రభుత్వం కార్పొరేట్లకు వేల కోట్ల రూపాయలు రుణాలను మాఫీ చేసిందని, సామాన్యులను విస్మరించిందని చెప్పారు. తాము అధికారంలోకి రాగానే కిసాన్ న్యాయ్ కింద రైతు రుణాలు మాఫీ చేస్తామన్నారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల మేరకు పంటల కనీస మద్దతుధరకు చట్టబద్దత కల్పిస్తామని చెప్పారు. కార్మికులు, కూలీలకు రోజుకు కనీస వేతనం రూ.400 అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. దేశ జనాభాలో 50శాతం ఉన్న వెనకబడిన తరగతులు, 15శాతం ఉన్న దళితులు, 8శాతం ఉన్న ఆదివాసీలు, 15శాతం ఉన్న మైనార్టీలు, ఐదు శాతం ఉన్న నిరుపేదలకు ప్రభుత్వంలో కానీ, మీడియా సంస్థల్లో కానీ, బడా వ్యాపార సంస్థల్లో భాగస్వామ్యం లేదన్నారు.

మోడీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలు, పారిశ్రామిక వేత్తల కోసమే పనిచేస్తుందని రాహుల్ విమర్శించారు. బిఆర్‌ఎస్ పాలన గురించి మాట్లాడుతూ ఇంటెలిజెన్స్, పోలీసు వ్యవస్థలను మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ దుర్వినియోగం చేశారని రాహుల్ విమర్శించారు. కేంద్రంలో ప్రధాని మోడీ కూడా అదే పని చేస్తున్నారని ఆరోపించారు. ఇడి బలవంతపు వసూళ్ల సంస్థగా మారిందన్నారు. దేశంలో అత్యంత అవినీతి మంత్రులు మోడీ దగ్గరే ఉన్నారనీ, ఎన్నికల కమిషన్‌లో కూడా మోడీ తన తొత్తులను నియమించారని ఆరోపించారు. ఇటీవల వెలుగులోకి వచ్చిన ఎలక్టోరల్ బాండ్స్ ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక కుంభకోణమని రాహుల్ పేర్కొన్నారు. కంపెనీల్లో తనిఖీలకు సిబిఐ వెళ్లిన కొద్దిరోజులకే ఆయా కంపెనీల నుంచి బిజెపికి విరాళాలు అందుతాయని, ఆవిధంగా సిబిఐ, ఇడిలను మోడీ ఉపయోగిస్తున్నారని విమర్శించారు. మోడీ దగ్గర ఇడి, సిబిఐ ఉంటే తమ దగ్గర దేశ ప్రజల ప్రేమాభిమానాలున్నాయని రాహుల్ అన్నారు. తెలంగాణలో బిజెపి బి టీమ్‌ను ఓడించామనీ, ఇప్పుడు బిజెపిని మట్టికరిపిస్తామని చెప్పారు. తెలంగాణకు తనకు కుటుంబ బంధం ఉందన్నారు

ఇండియా ఫోరమ్‌ను గెలిపించండి : రేవంత్ రెడ్డి

లోక్‌సభ ఎన్నికల్లో బిజెపిని తుక్కుతుక్కుగా ఓడించి ఇండియా ఫోరమ్‌ను గెలిపించాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. జూన్ 9న ఢిల్లీలో మువ్వన్నెల జెండా ఎగరాలన్నారు.. 'ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని మోడీ హామీ ఇచ్చారు. పదేళ్లలో 20 కోట్ల ఉద్యోగాలు ఇవ్వాల్సి ఉండగా.. కేవలం ఏడు లక్షల ఉద్యోగాలే ఇచ్చారని చెప్పారు. నల్ల చట్టాలకు వ్యతిరేకంగా పోరాడి అమరులైన 750 మంది కుటుంబాలను మోడీ కనీసం పరామర్శించలేదు" అని చెప్పారు. పదేళ్లలో కేసిఆర్ వందేళ్ల విధ్వంసం సృష్టించారని చెప్పారు. కెసిఆర్ నోటికొచ్చినట్టల్లా మాట్లాడుతున్నారని, అలాగే మాట్లాడితే జైలులో పెడతామని హెచ్చరించారు.

సిపిఎం త్రిస్సూర్ బ్యాంక్ ఖాతా స్తంభన

ఇది కేంద్ర ప్రభుత్వ రాజకీయ కక్షసాధింపు చర్య: సిపిఎం

ప్రజాశక్తి ప్రతినిధి - తిరువనంతపురం

కేరళలోని త్రిస్సూర్ లోక్‌సభ నియోజకవర్గంలో బిజెపి అభ్యర్థి ప్రయోజనార్థం.. సిపిఎం త్రిస్సూర్ జిల్లా కమిటీ బ్యాంక్ ఖాతాను ఆదాయపన్ను శాఖ అధికారులు స్తంభింపచేశారు. పార్టీకి ఈ మేరకు నోటీసులు జారీ చేశారు. బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎంజి రోడ్‌లోని జిల్లా కమిటీ అకౌంట్‌ను స్తంభింపచేసినట్లు ఆ నోటీసులో తెలియచేశారు. దానికి గల కారణమేంటనేది ఆ నోటీసులో వారు వివరించ లేదు. తదుపరి ఆదేశాలు జారీ చేసేవరకు ఎలాంటి ఆర్థిక లావాదేవీలు నిర్వహించరాదని ఆ నోటీసు పేర్కొంది. ఈ ఖాతా వివరాలు పరిశీలించేందుకు శుక్రవారం రాత్రి ఐటి అధికారులు బ్యాంక్ ఎంజి రోడ్ బ్రాంచికి చేరుకున్నారు. అదే సమయంలో జిల్లా కమిటీ కార్యదర్శిని కూడా బ్రాంచికి రావాల్సిందిగా పిలిపించారు. అంతకుముందు రోజే కోచిలో జిల్లా కార్యదర్శి ఎం.ఎం.వర్గీస్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు ఇంటరాగేట్ చేశారు. కరవన్నూర్ సర్వీస్ కో ఆపరేటివ్ బ్యాంక్‌కు సంబంధించిన సమస్యలకు సంబంధించి ఇంటరాగేషన్ జరిగింది. ఖాతా వివరాలను ఇడి అధికారలు అడిగి తెలుసుకున్నారు.

ఐటి శాఖ చర్యలు తీవ్రంగా ఖండించదగ్గవని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గం ఒక ప్రకటనలో పేర్కొంది.

ప్రతి సంవత్సరం పార్టీ ఆదాయ, ఖర్చుల వివరాలను ఆదాయపన్ను శాఖకు, ఎన్నికల కమిషన్‌కు సిపిఎం అందచేస్తుందని ఆ ప్రకటన పేర్కొంది. అలాగే త్రిస్సూర్ జిల్లా కమిటీ అకౌంట్ వివరాలను కూడా తెలియచేశామన్నారు. ముందస్తు సమాచారం, ఎలాంటి వివరణ లేకుండా అకౌంట్‌ను స్తంభింపచేశారని కార్యదర్శివర్గం విమర్శించింది. త్రిస్సూర్ జిల్లాలోసహకార బ్యాంకులకు సంబంధించిన సమస్యలపై పార్టీ నిర్దిష్ట వైఖరి తీసుకుంటూ వస్తోందని తెలిపింది. ఈ పరిస్థితుల్లో ప్రతిపక్ష పార్టీల నేతృత్వంలోని ప్రభుత్వాలను, ప్రతిపక్ష పార్టీలను వెంటాడి, వేధించేందుకు కేంద్ర ప్రభుత్వం అనుసరించే విధానంలో భాగమే ఈ చర్యలని కార్యదర్శివర్గం విమర్శించింది. ఈ ఎన్నికల క్రమంలో మరింత చురుకుగా పాల్గొనాల్సిందిగా, ఈ విధానాలపై పోరాడాల్సిందిగా కేరళ ప్రజలను కార్యదర్శివర్గం ఆ ప్రకటనలో కోరింది.

98.81శాతం పించన్ల పంపిణీ పూర్తి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రవ్యాప్తంగా 64.91లక్షల మందికి (98.81శాతం) మంది లబ్దిదారులకు రూ.1930.25 కోట్లు సామాజిక భద్రతా పింఛన్లను శనివారం నాటికి పంపిణీ చేసినట్లు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

పోలింగ్ విధులకు సిబ్బంది కొరత

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఎన్నికల డ్యూటీ

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి



రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికల్లో పోలింగ్ నిర్వహణకు అవసరమైన సిబ్బంది నియామకానికి జిల్లాల ఎన్నికల అధికారులు కసరత్తు చేస్తున్నారు. గత కొన్ని దశాబ్దాలుగా ఎన్నికల్లో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులనే పోలింగ్ నిర్వహణకు వినియోగిస్తున్నారు. ఈసారి వారి కొరత ఎక్కువగా ఉండడంతో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులను కూడా ఉపయోగించాలని ఎన్నికల కమిషన్ సూచించింది. ఈ మేరకు వారికి కూడా పోలింగ్ విధులు కేటాయిస్తూ జిల్లా కలెక్టర్లు ఉత్తర్వులు ఇచ్చారు. పోస్టల్, బ్యాంక్ ఉద్యోగులను ఎక్కువగా పోలింగ్ నిర్వహణకు కేటాయిస్తున్నారు. ఉపాధ్యాయులను పోలింగ్ విధులకు దూరంగా ఉంచాలని రాష్ట్ర ప్రభుత్వం కొద్ది నెలల క్రితం ప్రయత్నించిన సంగతి తెలిసిందే. ప్రయత్నాన్ని ఎన్నికల కమిషన్ అడ్డుకుంది. సచివాలయం ఉద్యోగులను మొత్తం పోలింగ్‌కు వినియోగించుకోవాలంటూ చేసిన సూచనకు ఎన్నికల కమిషన్ బ్రేకులు వేసింది. ఒక పోలింగ్ కేంద్రంలో కేవలం సచివాలయం ఉద్యోగి ఒకరే ఉండే విధంగా ఎన్నికల కమిషన్ నిర్ణయం తీసుకుంది. వీరికి కేవలం ఓటర్లకు ఇంకు వేసే బాధ్యత మాత్రమే అప్పగించాలని ఆదేశించింది. పోలింగ్ నిర్వహణకు శాశ్వత ఉద్యోగులను మాత్రమే వినియోగించాల్సిఉండటంతో సిబ్బంది కొరత ఏర్పడింది. చాలా కాలం నుండి ఉద్యోగ, ఉపాధ్యాయుల నియామకం జరగకపోవడం దీనికి కారణం. ఈ విషయాన్ని రాష్ట్ర అధికారులు కేంద్ర ఎన్నికల సంఘం దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో దీంతో, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులను ఎన్నికల విధుల్లో వినియోగించుకోవాలని ఎన్నికల కమిషన్ సూచించింది. ఈ మేరకు తొలుత పారా మిలటరీ, రైల్వే ఉద్యోగులను వినియోగించుకోవాలని భావించినప్పటికీ అది సాధ్యం కాదని తేలడంతో చివరకు బ్యాంక్, పోస్టల్ ఉద్యోగుల సేవలను వాడుకుంటున్నారు.

మరో నలుగురు మావోయిస్టుల కాల్చివేత

బస్తర్‌లో ఆగని ఎన్‌కౌంటర్లు

రాయ్‌పూర్ : ఛత్తీస్‌గఢ్-తెలంగాణ సరిహద్దులోని దండకారణ్యం మరోసారి నెత్తురోడింది. బస్తర్ ప్రాంతంలో శుక్ర, శనివారాల్లో భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య జరిగిన రెండు వేర్వేరు ఎన్‌కౌంటర్లలో నలుగురు మావోయిస్టులు చనిపోయారు. శనివారం ఉదయం బీజాపూర్ జిల్లా ఉసూరు పోలీసు స్టేషన్ పరిధిలోని డోలిగట్ట అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మావోయిస్టులు మరణించగా, దంతెవాడలో మరో ఎన్‌కౌంటర్‌లో ఒక నక్సల్ చనిపోయినట్లు సీనియర్ పోలీస్ అధికారి తెలిపారు. ఘటనా స్థలి నుండి ఒక తేలిక పాటి మెషిన్ గన్‌ను, ఎకె 47ను స్వాధీనం చేసుకున్నట్లు బస్తర్ రేంజ్ ఐజి సుందర్‌రాజ్ తెలిపారు. తాజా ఎదురుకాల్పుల్లో చనిపోయిన మావోయిస్టులతో కలిపి ఈ ఏడాది ఛత్తీస్‌గఢ్‌లో ఇప్పటివరకు మరణించిన వారి సంఖ్య 50కి చేరింది. వారం రోజుల వ్యవధిలోనే 23 మంది నక్సల్స్‌ను ఎన్‌కౌంటర్ల పేరుతో భద్రతా దళాలు చంపేశాయి. వీరిలో 33 మంది బీజాపూర్‌లో, ఆరుగురు దంతెవాడలో, ఐదుగురు కంకేర్‌లో, నలుగురు సుక్మాలో, ఇద్దరు నారాయణపూర్‌లో చనిపోయారు.

ఇసిని శాసించేలా బిజెపి అధ్యక్షురాలు

- ఐపిఎస్ బదిలీల లేఖను ఖండించిన సిపిఎం రాష్ట్ర కమిటీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కీలక స్థానాల్లో ఉన్న 22 మంది ఐపిఎస్‌లను బదిలీ చేసి వారి స్థానంలో ఎవర్ని నియమించాలో కూడా పేర్లను సూచిస్తూ ఎన్నికల కమిషన్‌కు బిజెపి లేఖ రాయడాన్ని సిపిఎం రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ విధంగా రాజ్యంగ వ్యవస్థలను బ్లాక్‌మెయిల్ చేయడాన్ని తాము ఖండిస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు .రాజ్యాంగబద్దంగా పనిచేయాల్సిన ఎన్నికల కమిషన్‌ను శాసించేలా బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు లేఖ రాయడం గర్హనీయమని పేర్కొన్నారు. ఇది ఎన్నికల కమిషన్ స్వతంత్రతను దెబ్బతీయడమేనని ఆందోళన వ్యక్తం చేశారు. కొంతమంది అధికారులకు వ్యతిరేకంగా ఫిర్యాదు చేస్తూ వారి స్థానంలో ఎవరెవరిని నియమించాలో కూడా సూచిస్తూ లేఖ రాయడం అనుచితమని పేర్కొన్నారు. ఒక రకంగా అనధికార సిఫార్సు చేయడమేనని తెలిపారు. ఈ లేఖలో ఎన్నికలు సజావుగా జరగాలన్న ఆలోచన కన్నా దురుద్దేశాలే ఎక్కువగా కనిపిస్తున్నాయని విమర్శించారు. కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ఇప్పటికే సిబిఐ, ఇడి, ఐటి వంటి సంస్థలను ప్రతిపక్ష నాయకులపై ఉసిగొల్పి దుర్వినియోగం చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అదే దారిలో బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు కేంద్రంలో అధికారాన్ని అడ్డుపెట్టుకొని లేఖ రాయడం, అధికార దురహంకారంతో శాసించే ప్రయత్నం చేయడం అప్రజాస్వామికమని పేర్కొన్నారు. ఇలాంటి అప్రజాస్వామ్యిక చర్యలను చైతన్యవంతమైన రాష్ట్రప్రజలు తిప్పికొట్టాలని విజ్ఞప్తి చేశారు.



గవర్నర్ల వ్యవస్థ రద్దు చేస్తాం

- పట్టణాల్లోనూ 'ఉపాధి'
- సిపిఐ ఎన్నికల ప్రణాళికలో హామీ

లోపలి పేజీలో..

పాముకాటుతో రైతు సంఘం నాయకుడు మృతి

ప్రజాశక్తి- సత్తెనపల్లి రూరల్



పాముకాటుకు పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండల రైతు సంఘం అధ్యక్షులు బగ్గి వెంకటేశ్వర్లు (65) శనివారం మృతి చెందారు. మండలంలోని కందులువారిపాలేనికి చెందిన ఆయన వేసవి నేపథ్యంలో తన ఇంటిపై వేసుకోవడానికి జమ్ము కోసం ఊరికి సమీపంలోని మడులకు మరొకరిని తోడు తీసుకుని వెళ్లారు. జమ్ము కోస్తుండగా ఏదో కుట్టినట్లు అనిపించడంతో చూడగా పాము కనిపించింది. వెంకటేశ్వర్లు పక్కనున్న వ్యక్తి కుటుంబీకులకు ఫోన్ ద్వారా సమాచారమిచ్చారు. వారొచ్చి సత్తెనపల్లి ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే వెంకటేశ్వర్లు మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. అంత్య క్రియలు ఆదివారం ఉదయం కందులవారి పాలెంలో నిర్వహిస్తామని, అనంతరం సంతాప సభ ఉంటుందని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎ.లక్ష్మీశ్వరరెడ్డి తెలిపారు. వెంకటేశ్వర్లు భౌతికకాయానికి సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు నివాళులర్పించారు.

ఆలోచించి ఓటేయండి

- గత అనుభవాలను దృష్టిలో ఉంచుకోండి
- కావలి 'మేమంతా సిద్ధం' సభలో జగన్
- నెల్లూరు జిల్లాలో రోడ్ షో



'మేమంతా సిద్ధం' సభలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి జగన్

ప్రజాశక్తి- కావలి (నెల్లూరు జిల్లా)

ప్రస్తుత ఎన్నికల యుద్ధంలో పేదల పక్షాన మీ బిడ్డ ఒక్కడే ఒక పక్షాన నిలబడితే, మరో పక్షాన మోసగాడు చంద్రబాబు, దత్తపుత్రుడు పవన్ కల్యాణ్, ప్రధాని మోడీ నిలబడ్డారని ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. రాష్ట్రాన్ని రెండు ముక్కలుగా విడగొట్టిన మరో జాతీయ పార్టీ వీరితో కలిసి మీ బిడ్డకు వ్యతిరేకంగా చేస్తోందని విమర్శించారు. ఇది ఎంఎల్‌ఎలు, ఎంపిలను ఎన్నుకునే ఎన్నికలు కావని, రాష్ట్రంలోని పేదలు, అక్కా, చెల్లెమ్మలు, అవ్వ, తాతలు భవిష్యత్తు నిర్ణయించే ఎన్నికలని పేర్కొన్నారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ప్రజలు ఆలోచించి ఓటేయాలని కోరారు. చంద్రబాబూ... పేదలతో యుద్ధానికి సిద్ధంగా ఉన్నావా? అని ప్రశ్నించారు. శనివారం నెల్లూరు జిల్లాలో జగన్ రోడ్ షో నిర్వహించారు. నెల్లూరు నగరం నుంచి కోవూరు జంక్షన్, సున్నపుబట్టి, కావలి తదితర ప్రాంతాల్లో రోడ్ షో పూర్తి చేసుకొని కావలి పట్టణంలో జరిగిన 'మేమంతా సిద్ధం' బహిరంగ సభలో మాట్లాడారు. ఈ ఎన్నికల్లో మీ బిడ్డ ఆత్మగౌరవాన్ని, విశ్వసనీయతను గెలిపించేందుకు మీరంతా సిద్ధమేనా? అని ప్రజలను అడిగారు. మోసం, అబద్ధాలు, కుట్రలు అన్ని కలగలిపిన క్యారెక్టరే చంద్రబాబు అని దుయ్యబట్టారు. 14 ఏళ్లు సిఎంగా పనిచేశానని చెప్పుకుంటున్న ఆయన ఎన్నికలకు ముందు మేనిఫెస్టో పేరుతో రంగురంగుల కాగితాలు పంచారని, గెలిచాక ఏ ఒక్క హామీనైనా నెరవేర్చలేదని విమర్శించారు. 2014లో ఇచ్చిన హామీల్లో ఒక్కటైనా నెరవేర్చానని చెప్పే దమ్ము, ధైర్యం ఉందా? అని ప్రశ్నించారు. తాను అడిగిన ప్రశ్నలకు చంద్రబాబు జవాబు చెప్పలేక నోటికి ఫెవికాల్ రాసుకున్నారని విమర్శించారు. ప్రజల వద్దకు వచ్చి ఓటు అడిగే ముందు 'నేను మీకు ఈ పనులు చేశాను. నాకు ఓట్లు వేయండి' అని కాకుండా మీకు అది చేస్తాం, ఇది చేస్తాం అని మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఈ సందర్భంగా పులి-బంగారు కడియం కథను జగన్ ఉదాహరించారు. 'కేజీ బంగారం ఇస్తా, బెంజ్ కారు ఇస్తా! సూపర్ సిక్స్ ఇస్తా! సూపర్ 7 ఇస్తా! అంటూ మోసగించాలని చూస్తున్నారని విమర్శించారు. ఎన్నికల మేనిఫెస్టోలోని 99 శాతం హామీలను అమలు చేశామన్నారు. మీకు సంక్షేమం అందించేందుకు 130 సార్లు డిబిటి బటన్ నొక్కానన్నారు. మీరు నా కోసం రెండుసార్లు ఫ్యాన్ గుర్తుపై బటన్ నొక్కాలని కోరారు. ఒక్కసారి గెలిపిస్తేనే 58 నెలల్లో 2 లక్షలా 71 వేల కోట్ల రూపాయల సంక్షేమాన్ని మీ ఇంటి ముందుకే తెచ్చి ఇచ్చానని వివరించారు. చంద్రబాబును నమ్మితే పులి నోట్లో తల పెట్టినట్లేనన్నారు. అనంతరం సింగరాయకొండ నుంచి కందుకూరు చేరుకున్నారు. ఆదివారం ప్రకాశం జిల్లా కనిగిరికి వెళ్లనున్నారు.

నిర్మాణ రంగాన్ని నిలబెడతా!

- ఉచిత ఇసుక విధానం పునరుద్ధరిస్తాం
- పాలనా వ్యవస్థను గాడిలో పెడతాం
- సత్తెనపల్లి, పెదకూరపాడు సభల్లో చంద్రబాబు



సత్తెనపల్లి సభలో మాట్లాడుతున్న చంద్రబాబు

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

అధికారంలోకి వచ్చాక ఉచిత ఇసుకతో నిర్మాణ రంగాన్ని నిలబెడతామని టిడిపి అధినేత చంద్రబాబు హామీ ఇచ్చారు. రాష్ట్రంలో ఉచిత ఇసుక విధానాన్ని పునరుద్ధరిస్తామన్నారు. గాడి తప్పిన పరిపాలన వ్యవస్థను గాడిలో పెడతామని అన్నారు. పల్నాడు జిల్లా పెదకూరపాడు, సత్తెనపల్లిలో శనివారం రాత్రి జరిగిన సభల్లో ఆయన ప్రసంగించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి గత ఐదేళ్లలో రూ.13 లక్షల కోట్లు అప్పులు చేశారన్నారు. ప్రస్తుతం ఉద్యోగులకు, ఇతరులకు లక్షన్నర కోట్ల రూపాయలు బకాయిలు ఉన్నారని తెలిపారు. పరిపాలనా వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని, కేంద్ర ప్రభుత్వ సహకారంతో పాలనను గాడిలో పెడతానన్నారు. వైసిపి నాయకులు ఇసుకను దోచేసి లక్షల మంది కార్మికుల పొట్టగొట్టారని విమర్శించారు. ఇసుక దోపిడీతో 40 లక్షల భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి లేకుండా చేశారన్నారు. ఇసుక బకాసురుడు పెదకూరపాడు ఎమ్మెల్యే శంకరరావు లాంటి వారు వల్ల భవన నిర్మాణ రంగం బాగా నష్టపోయిందని విమర్శించారు. తల్లి కాంగ్రెస్ పోటీతో ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకూడదన్నారు. జగన్‌ను వ్యతిరేకిస్తున్న షర్మిల, సునీతల అంశం వారి కుటుంబ వ్యవహారమని పేర్కొన్నారు. తండ్రి హత్యపై పోరాడుతున్న సునీత... షర్మిలకు మద్దతుపై పునరాలోచించుకోవాలన్నారు. కేంద్రంలో ఎన్‌డిఎ ప్రభుత్వం పదేళ్ల నుంచి ఉందని, మళ్లీ రాబోయేది ఎన్‌డిఎనని, అందుకే బిజెపి, టిడిపి, జనసేన జట్టుకట్టాయని వివరించారు. వైసిపి ప్రభుత్వంలో మైనారిటీలకు అన్యాయం జరిగిందన్నారు. తాము ఎన్‌డిఎ ఉన్నా ఏ ఒక్క ముస్లిం, మైనారిటీకీ అన్యాయం జరగనివ్వబోమని హామీ ఇచ్చారు. ఎన్‌డిఎతో 1995 నుంచి 2004 వరకు, 2014 నుంచి 2019 వరకూ కలిసే ఉన్నామన్నారు. ఏనాడు ముస్లిములకు మిగతా 2లో

వడదెబ్బకు రైతు మృతి

ప్రజాశక్తి - ఏర్పేడు (తిరుపతి జిల్లా)


సుబ్రమణ్యంరెడ్డి (ఫైల్)

ఎండ వేడిమి, వడగాల్పుల తీవ్రతతో తిరుపతి జిల్లా ఏర్పేడు మండలంలో ఓ రైతు మృతి చెందారు. మృతుని కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. నచ్చనేరి గ్రామ పంచాయతీ దుగ్గిపేరి గ్రామానికి చెందిన కందప్పగారి సుబ్రమణ్యంరెడ్డి (52)కి ఒకటిన్నర ఎకరా పొలం ఉంది. శుక్రవారం పొలం పనులు ముగించుకుని రాత్రికి ఇంటి చేరుకున్నారు. ఆ తర్వాత నుంచి వాంతులతో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. గమనించిన కుటుంబసభ్యులు ఆయనను అర్ధరాత్రి సమయంలో తిరుపతిలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తీసుకువెళ్తుండగా మార్గమధ్యంలో మరణించారు. ఆయనకు భార్య, ఇద్దరు కొడుకులు, ఒక కుమార్తె ఉన్నారు.

టిడిపికి ఘోర పరాభావమే

- సజ్జల రామకృష్ణారెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు తనకు తానే సర్వాధికారి అన్నట్లు ప్రవర్తిస్తూ, పూనకం వచ్చినట్లు వ్యవస్థలన్నింటిపై దాడికి పాల్పడుతున్నారని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి విమర్శించారు. శనివారం తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ, చంద్రబాబుకు ఫ్రస్టేషన్ పరాకాష్టకు చేరిందని, పొత్తు వికటించటంతో ఏం చేస్తున్నారో ఆయనకు అర్థం కావటం లేదని అన్నారు. వచ్చే ఎన్నికల్లో టిడిపికి ఘోర పరాభవం తప్పదని చెప్పారు. ఎన్నికల కమిషన్‌కు విచక్షణాధికారం ఉందని, అధికారులపై వారు తీసుకున్న నిర్ణయాన్ని తాము ప్రశ్నించబోమని చెప్పారు.. బిజెపి అధ్యక్షురాలు పురంధేశ్వరి పెట్టిన లేఖ ప్రకారం అయితే రాష్ట్రంలోని అధికారులంతా అమ్ముడుపోయినట్లేనన్నారు.

షర్మిల ఒక పెయిడ్ ఆర్టిస్ట్

ఎపి కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిల పెయిడ్ ఆర్టిస్ట్‌లా ఎందుకు మాట్లాడుతున్నారని సజ్జల ప్రశ్నించారు. నాలుగేళ్లుగా పట్టని వివేకా హత్య ఈ రోజు హఠాత్తుగా ఎందుకు పట్టిందన్నారు. ఏ ప్రాతిపదిక లేని, అసంబద్ధమైన ఆరోపణలకు సమాధానాలు చెప్పుకుంటూ పోతే ఎక్కడికి పోతుందో కూడా తెలియదని చెప్పారు.

టిడిపి పాటపై ఇసికి వైసిపి ఫిర్యాదు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తెలుగుదేశం పార్టీ విడుదల చేసిన పాటలు ఎన్నికల ప్రవర్తనా నియమావళికి విరుద్ధంగా ఉన్నాయని, 'సైకో పోవాలి - సైకిల్ రావాలి' పాటను తక్షణమే నిలుపుదల చేయాలని విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనాకు ఫిర్యాదు చేశారు. శనివారం సచివాలయంలో సిఇఒను కలిసిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ, చంద్రబాబు వాడిన భాషపై ఇప్పటికే ఇసి నోటీసులు ఇచ్చిందని, అయినా తీరు మారకపోవటం శోభనీయమని చెప్పారు. సిఎంను కించపరిచేవిధంగా ఉన్న సైకో పోవాలి పాటను తక్షణమే నిలుపుదల చేయాలని సిఇసిని కోరినట్లు తెలిపారు. టిడిపి, జనసేన, బిజెపిలకు అజెండా అంటూ ఏమీ లేదని, ప్రభుత్వాన్ని దుర్భాషలాడటానికే పరిమితమయ్యాయని చెప్పారు.

ప్రతిపక్షం నిలదీయడం తప్పా?

కొమ్మారెడ్డి పట్టాభిరామ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో కొందరు ఐఎఎస్ అధికారులు జెపిఎస్ (జగన్ పర్సనల్ సర్వీస్) లాగా మారారని టిడిపి అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్ ఆరోపించారు. ఎన్నికలు సజావుగా జరపాలని అధికారులను నిలదీయడం తప్పా అని ఆయన ప్రశ్నించారు. మంగళగిరి టిడిపి కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. కొంతమంది ఐఎఎస్ అధికారులు తాడేపల్లి ప్యాలెస్ చెప్పినట్లు చేస్తూ ప్రజలకు వ్యవస్థలపై నమ్మకం సన్నగిల్లేలా వ్యవహరించారన్నారు. నందిగామ ఎమ్మెల్యే మొండితోక జగన్మోహన్‌రావు, ఆయన సోదరుడు అరుణ్ ప్రశ్నించిన వాళ్లను చంపే ప్రయత్నం చేశారని ఆరోపించారు. భద్రతా లోపం జరిగితే మాట్లాడకూడదా? అని పట్టాభి ప్రశ్నించారు.

వెలుగులోకి ర్యాంకీ అబద్ధాలు

- ఎపిఐఐసి 50 ఎకరాలు ఇవ్వకుండానే ఇచ్చినట్లు ప్రచారం
- ల్యాండ్‌ఫిల్ ప్రజాభిప్రాయ సేకరణలో తప్పుడు సమాచారం!


ల్యాండ్‌ఫిల్ కోసం ర్యాంకీకి కేటాయించిన స్థలం

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

అనకాపల్లి జిల్లా పరవాడ మండలం తాడిలో ల్యాండ్‌ఫిల్ ఏర్పాటుకు ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (ఎపిఐఐసి) 50 ఎకరాలు రాంకీకి అప్పగించకుండానే ఎపి కాలుష్య నియంత్రణ మండలి ప్రజాభిప్రాయసేకరణ నిర్వహించడం వివాదస్పదమవుతోంది. 50 ఎకరాలు కేటాయించినట్లు ర్యాంకీ చెప్పిన మాటలు అబద్ధాలని అధికారి వివరణతో స్పష్టమైంది. ఈ ఏడాది జనవరి 31న నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణ నుంచి భూమి కేటాయింపు వరకూ ఏ రోజూ ప్రజలకు ర్యాంకీ యాజమాన్యం నిజాలు చెప్పలేదు. ప్రజాభిప్రాయ సేకరణకు ముందు పాటించాల్సిన కనీస నియమ, నిబంధనలేవీ పాటించలేదు. కనీసం దండోరా వేయించలేదు. ప్రజాభిప్రాయ సేకరణ విషయం గ్రామస్తులకు తెలీకుండా జాగ్రత్తలు తీసుకున్న ర్యాంకీ యాజమాన్యం పర్యావరణ ప్రభావ అంచనా నివేదిక (ఇఐఎ)లోనూ ఎపిఐఐసి 2022 జూన్ 17న 50 ఎకరాల భూమి లీజు ప్రాతిపదికన కేటాయించినట్లు తప్పుడు సమాచారం ఇచ్చింది. తాడి సర్వే నెంబర్ 116 పార్ట్‌లోని 50 ఎకరాల్లో ర్యాంకీకి ల్యాండ్‌ఫిల్ ఏర్పాటుకు ఎపిఐఐసి పదెకరాలు కేటాయిస్తే 50 ఎకరాలు కేటాయించినట్లు తెలిపింది.

పదెకరాలే కేటాయింపు !

పరవాడ ఫార్మా సిటీ, ఇతర పరిశ్రమల నుంచి వచ్చే ప్రమాదకర వ్యర్థాలను శుద్ధి చేసి, నిల్వ చేయడానికి రూ.200 కోట్ల వ్యయంతో ల్యాండ్‌ఫిల్ ఏర్పాటుకు దరఖాస్తు చేసుకున్న ర్యాంకీకి 33 ఏళ్ల లీజుకు ఎపిఐఐసి పదెకరాలు మాత్రమే కేటాయించింది. మరో 40 ఎకరాలను రిజర్వులో పెట్టింది. పదెకరాలకు ర్యాంకీ డబ్బులు చెల్లించింది. స్క్వేర్ మీటరుకు రూ.1,200 చొప్పున (ఎకరాకు 4,047 స్క్వేర్ మీటర్లు) పదెకరాలకు నాలుగు కోట్ల 85 లక్షల 64 వేల రూపాయలను రెండు దఫాలుగా ఎపిఐఐసికి చెల్లించింది. 2022 మే 9న ఇఎండి కింద కొంత కట్టగా మిగిలిన మొత్తం అదే ఏడాది సెప్టెంబరు 22న చెల్లించింది. ఈ మొత్తానికి ఎపిఐఐసి పదెకరాలు అప్పగించింది. ర్యాంకీ మాత్రం లీజు ప్రాతిపదికన 50 ఎకరాలు కేటాయించినట్లు పేర్కొని ఇఐఎ నివేదికలో తప్పుడు సమాచారమిచ్చి ప్రజలను మోసగించింది. గ్రీన్‌బెల్ట్‌కు ఉపయోగించాల్సిన స్థలాలను అమ్ముకొని సొమ్ము చేసుకుందన్న ఆరోపణలు కూడా ర్యాంకీపై ఉన్నాయి.

చర్య తీసుకోవాలి



చట్టాలు, నియమనిబంధనలు అమలు చేయని ర్యాంకీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి. సదరు సంస్థ ల్యాండ్‌ఫిల్ ఏర్పాటులో కూడా ప్రజలకు నిజం చెప్పలేదు. ప్రజాభిప్రాయ సేకరణలో ప్రజలను, ప్రభుత్వ యంత్రాంగాన్ని మోసగించింది. ప్రభుత్వాలను మేనేజ్ చేసుకొని నిబంధనల ఉల్లంఘనకు పాల్పడడం ర్యాంకీకి అలవాటుగా మారింది. గతంలో గ్రీన్‌బెల్ట్ స్థలాలను అమ్ముకుంది. ర్యాంకీ ఫార్మాసిటీ వల్ల తీవ్ర కాలుష్య కోరల్లో చిక్కుకున్న తాడి గ్రామాన్ని ఆ గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం వెంటనే తరలించాలి.

-కె.లోకనాథం, సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి


చంద్రబాబు కాన్వాయ్‌ని అడ్డుకుంటున్న టిడిపి శ్రేణులు

చంద్రబాబును అడ్డుకున్న తెలుగు తమ్ముళ్లు

- ఉండి అభ్యర్థి రామరాజును మార్చొద్దని డిమాండ్

ప్రజాశక్తి- పాలకొల్లు (పశ్చిమ గోదావరి జిల్లా)

పశ్చిమగోదావరి జిల్లా ఉండి టిడిపి అభ్యర్థి మంతెన రామరాజును మార్చరాదని కోరుతూ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు అడ్డుకున్నారు. రామరాజును మారుస్తారని ప్రచారం జరుగుతుండడంతో ఈ కార్యక్రమం చేపట్టారు. దీంతో, కొంతసేపు ఉద్రిక్తత చోటుచేసుకుంది. పాలకొల్లులోని ఎస్ కన్వెన్షన్ సెంటర్లో నరసాపురం పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల టిడిపి, జనసేన, బిజెపి నేతలతో శనివారం చంద్రబాబు సమీక్షించారు. ఈ సమావేశం అనంతరం కారులో వెళ్తున్న ఆయనను టిడిపి శ్రేణులు అడ్డుకున్నాయి. చంద్రబాబు రక్షణ సిబ్బంది వారిని పక్కకు నెట్టేసి కాన్వాయ్‌కి దారి కల్పించారు. అనంతరం రామరాజు మాట్లాడుతూ చంద్రబాబు మాటను పాటిస్తానని, అదే సమయంలో కార్యకర్తల మనోభావాలకు విలువ ఇస్తానని చెప్పడం చర్చనీయాంశమైంది.

కూటమిలోని ఏ పార్టీ అభ్యర్థికి టికెట్ ఇచ్చినా కలిసికట్టుగా పనిచేయాలి : చంద్రబాబు

టిడిపి, జనసేన, బిజెపికి చెందిన ఏ అభ్యర్థి పోటీలో ఉన్నా కూటమిలోని మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభ్యర్థులు సమన్వయంతో పనిచేసి విజయం సాధించాలని టిడిపి అధినేత చంద్రబాబు మూడు పార్టీల నాయకులకు దిశానిర్దేశం చేశారు. పాలకొల్లులోని ఎస్ కన్వెన్షన్ సెంటర్లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి టిడిపి, జనసేన, బిజెపికి చెందిన పదిమంది నాయకులు చొప్పున 30 మంది నాయకులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. గత రాత్రి పాలకొల్లు జనసేన నేత, సినీ నిర్మాత బన్నీవాసును స్టేజ్‌పైకి ఎక్కించి లేదని అలిగిన ఆ పార్టీ నేతలు ఈ సమావేశానికి హాజరు కాలేదు. గుంటూరుకు వెళ్లేందుకు ప్రయాణం అవుతుండగా ఆఖరి నిమిషంలో చంద్రబాబును వారు కలిసి ఫొటోలు తీయించుకున్నారు. ఎంపి రఘురామకృష్ణంరాజు ఆఖరి నిమిషంలో చంద్రబాబును కలిసేందుకు వచ్చి కలవకుండానే వెళ్లిపోయారు. చివరిలో హెలికాప్టర్ వద్ద కలిసి చంద్రబాబుతో కరచాలనం చేశారు.

244 మంది వలంటీర్ల రాజీనామాలు

ప్రజాశక్తి-యంత్రాంగం

రాష్ట్రంలో వలంటీర్ల మూకుమ్మడి రాజీనామాలు కొనసాగుతూనే ఉన్నాయి. పలు జిల్లాల్లో 244 మంది వలంటీర్లు శనివారం స్వచ్ఛందంగా రాజీనామాలు చేశారు. ఐదేళ్లుగా నిస్వార్థంగా సేవలందించిన తమను ప్రతిపక్షాలు ఇష్టారీతిన మాట్లాడుతున్నందున మనస్తాపానికి గురై రాజీనామాలు చేస్తున్నట్లు ప్రకటించారు. రాజీనామా పత్రాలను ఎంపిడిఒ, మున్సిపల్ కార్యాలయాల్లో, సచివాలయాల్లో అందజేశారు. విజయనగరం జిల్లా పూసపాటిరేగ మండలంలో మొత్తం 77 మంది వలంటీర్లు స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను ఎంపిడిఒ రాధికకు అందజేశారు. భోగాపురం మండలంలో 18 మంది, పార్వతీపురం మన్యం జిల్లా వీరఘట్టం మండలంలో 28 మంది రాజీనామాలు చేశారు. విశాఖపట్నం జిల్లా పద్మనాభం మండలంలో 60 మంది వలంటీర్లు తమ రాజీనామా పత్రాలను ఎంపిడిఒకు అందజేశారు. అనకాపలి జిల్లా గొలుగొండ మండలంలోని ఎఎల్.పురం, కృష్ణదేవిపేట, చోద్యం, కొత్తమల్లంపేట, జోగుంపేట, పప్పుశెట్టిపాలెం, కొమిర, పాతమల్లంపేటల్లో వలంటీర్లు పంచాయతీ కార్యదర్శులకు రాజీనామాలు ఇచ్చారు. శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి మండలంలో 38 గ్రామ పంచాయతీలకు చెందిన 23 మంది, కృష్ణా జిల్లా గంపలగూడెం మండలంలో 33 మంది, బాపట్ల జిల్లా వేటపాలెం మండలంలో ఐదుగురు వలంటీర్లు వలంటీర్లు మూకుమ్మడిగా రాజీనామాలు చేశారు.


కృష్ణా జిల్లా గంపలగూడెంలో రాజీనామాలు చేసిన వలంటీర్లు

వీకెండ్‌లో నేతలు బిజీ.. బిజీ

- హైదరాబాద్, బెంగుళూర్లలో ఆత్మీయ సమ్మేళనాలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ఆయా రాజకీయ పార్టీల నేతలు ఓటర్లను ఆకట్టుపనిలో నిమగ్నమయ్యారు. ఇప్పటికే ఇంటింటి ప్రచారంలో మునిగి తేలుతున్న అభ్యర్థులు ఇతర ప్రాంతాలకు బతుకు దెరువు కోసం వలసలు వెళ్లిన ఓటర్ల కోసం శని, ఆదివారాల్లో వీకెండ్ ప్రోగ్రామ్స్ నిర్వహిస్తూ బిజీ బిజీ అవుతున్నారు. ఆత్మీయ సమ్మేళనాల పేరుతో ఫంక్షన్ హాల్స్, బడా హోటల్స్‌లో ప్రత్యేకంగా సమావేశాలు నిర్వహిస్తున్నారు.

రానున్న ఎన్నికల్లో తమకు ఓటు వేసే విధంగా ఓటర్లను ఆకట్టుకునే పనిలో అభ్యర్థులు నిమగ్నమయ్యారు. పనిలోపనిగా కుల సంఘాల సహకారంతో వలస ఓటర్లు ఉన్న ప్రాంతాల్లో నేతలు పర్యటిస్తున్నారు. ఎన్నికల కమిషన్ దృష్టిలో పడకుండా సమావేశాలను నిర్వహిస్తూ ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో ఆయా పార్టీలు నిమగ్నమయ్యాయి. విజయవాడలోని పలు ప్రాంతాల్లో ఇటువంటి ఆత్మీయ సమ్మేళనాలను రాజకీయపార్టీలు నిర్వహించాయి. కనిగిరి, ఉదయగిరి నియోజకవర్గ ఓటర్లు సుమారు 6నుంచి 7 వేల మంది విజయవాడలోని భవానీపురం, విద్యాధరపురం, కృష్ణలంక, రాణీగారి తోట, శ్రీనగర్‌కాలనీ, సింగ్‌నగర్ ప్రాంతాల్లో ఉండటంతో ఇటీవల వైసిపి, టిడిపి అభ్యర్థులు ఓ ప్రముఖ హోటల్‌లో వలస ఓటర్లతో ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించారు. రాయలసీమ, కోస్తా ఆంధ్ర ప్రాంతానికి చెందిన వేలాది మంది బతుకు దెరువు కోసం బెంగుళూరు, హైదరాబాద్‌కు వెళ్లారు. భవన నిర్మాణ రంగంతోపాటు చిరు వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగించే వారి సంఖ్య అత్యధికంగా ఉంది. వీరితో పాటు యువత సాఫ్ట్‌వేర్ రంగంలోనూ, రియల్ ఎస్టేట్ రంగంలోనూ కొనసాగే వారు అత్యధికంగానే ఉన్నారు. వీరంతా హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి, అమీర్‌పేట, దిల్‌కుష్‌నగర్, ఎర్రగడ్డ, ఎల్‌బి నగర్, ఉప్పల్ ప్రాంతాల్లో చిన్న చిన్న పనులు చేసుకుంటూ నివసిస్తున్నారు. మరికొందరు బెంగుళూరు, పుణేలో నివాసం ఉంటున్నారు.,నేతలు వారమంతా తాము పోటీ చేసే నియోజకవర్గాల్లో పర్యటిస్తూ వారం చివరలో, శని, ఆదివారాల్లో ఈ ప్రాంతాలకు వెళ్లి వారిని కలుస్తున్నారు.

భారీగా మద్యం పట్టివేత

ప్రజాశక్తి - మునగపాక, తిరువూరు


పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం బాక్సులు

గోవా నుంచి అక్రమంగా దిగుమతి చేసుకున్న మద్యం నిల్వలను అనకాపల్లి పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. యలమంచిలి సిఐ గఫూర్ కథనం ప్రకారం.. అక్రమ మద్యం రవాణా విషయం ఎస్ఐ ప్రసాదరావుకు తెలియడంతో ఆయన స్థానిక పోలీసులతో కలిసి మునగపాక మండలంలోని యాదగిరిపాలెంలో మాటు వేశారు. అనుమానాస్పదంగా ముగ్గురు వ్యక్తులు రెండు మోటార్ సైకిళ్లపై కొన్ని వస్తువులను తీసుకు వెళుతుండగా వారిని అడ్డగించారు. వారి వద్ద ఉన్న లగేజీలను తనిఖీ చేయగా ఐదు కేసుల మద్యం బాటిళ్లు లభించాయి. అనంతరం వారిని విడివిడిగా విచారించగా యలమంచిలి మండలంలోని సోమలింగపాలెం గ్రామంలో ముద్దాయిల పశువుల పాకలోగల గడ్డివాములో దాచిపెట్టిన రూ.49.35 లక్షలు విలువ చేసే 39,168 బాటిళ్లు లభ్యమయ్యాయి. వాటిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు వ్యక్తులను మరింత లోతుగా విచారిస్తున్నారు. ఎన్‌టిఆర్‌జిల్లా తిరువూరు, ఏ.కొండూరు మండలాల్లో నాటు సారా, బెల్టు షాప్‌లపై ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సోదాలు చేశారు. తిరువురులోని బోయబజారులో నల్లబోతుల స్వాతి వద్ద ఉన్న 23 డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే పాల్టీయా తండాలో ఓ వ్యక్తి వద్ద ఉన్న ఐదు లీటర్ల నాటుసారాయిని స్వాధీనం చేసుకున్నారు.

అరాచక పాలనకు నిదర్శనం

- టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మైనార్టీ మహిళ బురఖాను తొలగించే స్థాయికి వైసిపి నేతల అహంకారం చేరుకుందని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు విమర్శించారు. నందికొట్కూరులో మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యులు మైనార్టీ సోదరి పట్ల అనుచితంగా వ్యవహరించడం, ప్రశ్నించిన బాధితులపైనే తిరిగి దాడి చేయడం రాష్ట్రంలో అరాచక పాలనకు నిదర్శనమని శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మత ఆచారాలను గౌరవించని, మహిళల మనోభావాలకు విలువివ్వని ఇలాంటి కౌరవ మూకను మే 13వ తేది అన్ని వర్గాలు ఏకమై తరిమికొడదామని తెలిపారు. జగన్ పాలనలో ముస్లింలకు రక్షణ లేదని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు మరో ప్రకటనలో విమర్శించారు.

'ఉక్కు' పరిరక్షణలో వామపక్షాలు కీలక భూమిక : సిపిఎం

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)



విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ కాకుండా అడ్డుకోవడంలో సిపిఎం, వామపక్షాలు కీలక భూమిక పోషించాయని సిపిఎం జగదాంబ జోన్ కార్యదర్శి ఎం.సుబ్బారావు అన్నారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన రిలేదీక్షలు శనివారానికి 1100వ రోజుకు చేరాయి. దీక్షల్లో ముఠా కార్మికులు, డివైఎఫ్ఐ నాయకులను ఉద్దేశించి సుబ్బారావు మాట్లాడుతూ.. కేంద్రంలోని బిజెపి సర్కారు ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మేసే క్రమంలో వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌నూ విక్రయించాలని నిర్ణయించుకుందని తెలిపారు. దానిని ప్రతిఘటించే పరిస్థితుల్లో వైసిపి ప్రభుత్వం లేకపోవడం, ప్రతిపక్షాలు బిజెపితో కలిసి వెళ్లడం రాష్ట్ర ప్రజలకు ద్రోహం చేయడమేనని అన్నారు. సిపిఎం, వామపక్షాలు మాత్రమే స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు కట్టుబడి పోరాటాలు చేశాయన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. దీక్షల్లో డివైఎఫ్ఐ నాయకులు కె.గణేష్, ఎల్లాజీ, శ్రీనివాస్, ముఠా కళాసీలు, సిఐటియు జగదాంబ జోన్ కార్యదర్శి కెవిపి.చంద్రమౌళి పాల్గొన్నారు.


నరసింహులు భార్యకు భరోసా పత్రం అందజేస్తున్న భువనేశ్వరి

అరాచక పాలనకు చరమగీతం పాడాలి

- నారా భువనేశ్వరి

ప్రజాశక్తి- యంత్రాంగం

రాష్ట్రంలో జగన్ అరాచక పాలనకు చరమగీతం పాడాలని చంద్రబాబు సతీమణి భువనేశ్వరి ప్రజలను కోరారు. ఈ ఎన్నికల్లో తెలుగుదేశం విజయం సాధిస్తుందని, అప్పుడు అన్ని తరగతులకు మంచి జరుగుతుందని అన్నారు. 'నిజం గెలవాలి' కార్యక్రమంలో భాగంగా శనివారం ఆమె నంద్యాల జిల్లాలో పర్యటించారు. చంద్రబాబు అక్రమ అరెస్టు సందర్భంగా గుండెపోటుతో మరణించిన టిడిపి కార్యకర్తల కుటుంబ సభ్యులను పరామర్శించి భరోసా ఇచ్చారు.

తొలుత జిల్లా కేంద్రంలోని ఎస్ఎన్ ఫంక్షన్ హాలులో నంద్యాల నియోజకవర్గ ముస్లిము మహిళలతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. నారా భువనేశ్వరి మాట్లాడుతూ.. ఆనాడు నందమూరి తారక రామారావు పేదవారికి పట్టేడన్నం పెట్టాలని, పేదలను ఆదుకోవాలని తెలుగుదేశం పార్టీని స్థాపించారన్నారు. వారి కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారని తెలిపారు. అదే అడుగు జాడల్లో నారా చంద్రబాబు నాయుడు నడుస్తూ.. ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలు తీసుకువచ్చారని వివరించారు. నంద్యాల జిల్లా మిడ్తూరు మండలం నాగులోటి గ్రామంలో చిన్న మాసూన్ సాహెబ్ కుటుంబాన్ని, పాణ్యం నియోజవర్గం కల్లూరు అర్బన్ 37వ వార్డు ఉల్చాలా రోడ్డు సెంటర్‌కు చెందిన నరసింహులు కుటుంబాన్ని భువనేశ్వరి పరామర్శించారు. కార్యకర్తలను ఆదుకుంటామని భరోసానిచ్చారు. భువనేశ్వరి వెంట నంద్యాల ఎమ్మెల్యే అభ్యర్థి ఎన్ఎండి ఫరూక్, మాజీ మంత్రి, ఆళ్లగడ్డ ఎమ్మెల్యే అభ్యర్థి భూమా అఖిల ప్రియ, మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి తదితరులు ఉన్నారు.

నేడు 64మండలాల్లో తీవ్ర వడగాల్పులు

- 222 మండలాల్లో వడగాల్పులు
- విపత్తుల నిర్వహణ సంస్థ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా ఆదివారం 66మండలాల్లో తీవ్ర వడగాల్పులు, 222 మండలాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ పేర్కొంది. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఈనెల 8న 22మండలాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉన్నట్లు విపత్తుల నిర్వహణ సంస్థ ఎమ్‌డి రోణంకి కూర్మనాథ్ తెలిపారు.

ఆదివారం తీవ్ర వడగాల్పులు శ్రీకాకుళం జిల్లాలో 15మండలాలు, విజయనగరంలో 24, పార్వతీపురం మన్యంలో 11, విశాఖలో 1, అనకాపల్లిలో 7, కాకినాడలో 4, తూర్పుగోదావరిలో 2 మండలాల్లో వీచే అవకాశం ఉందని తెలిపారు. శనివారం అనకాపల్లి జిల్లా రావికమతం, నంద్యాల జిల్లా బ్రాహ్మణ కొట్కూరు, పార్వతీపురం మన్యం జిల్లా మక్కువ, లేవిడి, ప్రకాశం జిల్లా తోకపల్లి, వైఎస్ఆర్ జిల్లా బలపనూరులో 44.6 డిగ్రీల సెల్షియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కర్నూలు జిల్లా గూడూరులో 44.6, విజయనగరం రాజాంలో 44.4, డిగ్రీల అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. 127 మండలాల్లో తీవ్ర వడగాల్పులు, 231 మండలాల్లో వడగాల్పులు వీచాయని విపత్తుల నిర్వహణ సంస్థ ఎమ్‌డి తెలిపారు.

ఉండి టికెట్ నాకు ఇస్తానని చెప్పలేదు

- రఘురామకృష్ణంరాజు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

'ఉండి ఎమ్మెల్యే టికెట్ నాకు ఇస్తానని చెప్పలేదు.. అలాగని స్థానిక ఎమ్మెల్యే మంతెన రామరాజుకు టికెట్ లేదని చంద్రబాబు చెప్పలేదు' అని నరసాపురం ఎంపి రఘురామకృష్ణంరాజు అన్నారు. భీమవరంలోని ఆయన కార్యాలయంలో శనివారం రచ్చబండ నిర్వహించారు. ఈ సందర్భంగా రఘురామ మాట్లాడుతూ.. తాను ఎన్నికల్లో కచ్చితంగా పోటీ చేస్తానని తెలిపారు. కండిషన్ పెట్టి తాను టిడిపిలో చేరలేదని వివరించారు. ప్రస్తుతం టిడిపిలో చేరాను కాబట్టి పార్టీ నిర్ణయం మేరకు ముందుకెళ్తానని చెప్పారు. పార్టీ ఆదేశానుసారం ఎక్కడి నుంచి పోటీ చేయమంటే అక్కడి నుంచి పోటీ చేస్తానని తెలిపారు. ఎమ్మెల్యేగానా, ఎంపిగానా అనేది చంద్రబాబు నిర్ణయించాలన్నారు. విజయనగరం నుంచి పోటీ చేయాలని ఆ ప్రాంతం వారు తనను ఆహ్వానించారని చెప్పారు. ఈ నెల పింఛన్ల పంపిణీలో 35 మంది వృద్ధులు మృతి చెందారని, వీటిని తాను ప్రభుత్వ హత్యలుగా భావిస్తున్నానని చెప్పారు. పోలీసులను ఇష్టమొచ్చినట్లు డిజిపి మారుస్తున్నారని విమర్శించారు.

రూ. తొమ్మిది లక్షల నగదు పట్టివేత

ప్రజాశక్తి - డెంకాడ

ఎన్నికల నియమావళికి విరుద్ధంగా తరలిస్తున్న నగదును పోలీసులు పట్టుకున్నారు. విజయనగరం జిల్లా డెంకాడ మండలంలోని మోదవలస చెక్‌పోస్టు వద్ద శుక్రవారం అర్ధరాత్రి పోలీసులు వాహన తనిఖీ చేపట్టారు. విశాఖ నుంచి ఒడిశా వెళ్తున్న ఓ కారును ఆపి తనిఖీ చేశారు. కారులోని రూ. తొమ్మిది లక్షల నగదును గుర్తించి, స్వాధీనం చేసుకున్నారు. నగదుకు సంబంధించిన సరైన పత్రాలను యజమాని చూపించకపోవడంతో కేసు నమోదు చేశారు.

పాత బిల్లులకు మోక్షం

- ఓటాన్ అకౌంట్‌పై మార్గదర్శకాల జిఓ జారీ

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

ఎన్నికల వేళ బిల్లులపై వస్తున్న విమర్శలను అధిగమించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలకు సిద్ధమైంది. గతేడాది ఆమోదం పొంది కూడా చెల్లింపులకు నోచుకోని బిల్లులను ఈ ఏడాది ముందుగానే చెల్లించేందుకు నిర్ణయించింది. ఈ మేరకు ఆర్థికశాఖ తాజాగా ఉత్తర్వులను విడుదల చేసింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో తొలి నాలుగు నెలలకు నిధుల వినియోగంపై శాసనసభ అనుమతి తీసుకున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగానే ఆ నిధులను ఎలా వినియోగించాలన్న కోణంలో ఆర్థికశాఖ మార్గదర్శకాలను జారీ చేసింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో వేల కోట్ల రూపాయల బిల్లులు పెండింగ్‌లో ఉండిపోయాయి. వీటిల్ల పనులకు సంబంధించి కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన బిల్లులతోపాటు ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బిల్లులు కూడా పెద్దమొత్తంలోనే ఉన్నాయి. నిధుల లేమిని కారణంగా చూపిస్తూ కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించలేకపోతున్నామని అధికారులు చెబుతున్నప్పటికీ, కావాల్సిన వారికి మాత్రం రూ.వేల కోట్ల బిల్లులు లోపాయికారిగా చెల్లించినట్లు విమర్శలు కూడా ఉన్నాయి. ఇదే సమయంలో గ్రాట్యూటీ, పింఛన్లు, వైద్య బిల్లులు వంటివి చెల్లింపులు లేకపోవడంతో ఉద్యోగ, ఉపాధ్యాయవర్గాల్లోనూ తీవ్ర అసంతృప్తి నెలకొంది. ఇలా చెల్లింపులు జరగని బిల్లుల్లో అనేకం ఆర్థిక శాఖ అనుమతి పొందినప్పటికీ, చెల్లింపులు మాత్రం జరగలేదు.

పనుల బిల్లుల బాధ్యత హెచ్‌ఒడిలదే

ఇక మేజర్, మైనర్ పథకాల బిల్లులకు సంబంధించి శాఖాధిపతులే పర్యవేక్షించాలని, ఆ తరువాతే డిడిఒలకు సమర్పించాలని సూచించింది. బడ్జెట్‌లో కేటాయింపులను అనుసరించి ప్రత్యేక బిఆర్ఒ అవసరం లేకుండానే 'డైరెక్ట్ డెబిట్' కింద శాఖాధిపతులు నిధుల విడుదల చేయవచ్చునని ఆర్థికశాఖ పేర్కొంది.

కేంద్ర పథకాలకు నేరుగా..

రాష్ట్రంలో అమలు చేసే కేంద్ర పథకాలకు వచ్చే నిధులకు జమ చేయాల్సిన రాష్ట్ర వాటా నిధులను నేరుగా ఆయా ఖాతాలకు జమ చేసుకోవచ్చు. అయితే ఈ పథకాల నిర్వహణలో భాగస్వామ్యులైన ఉద్యోగుల వేతనాలు, ఇతర వ్యయాన్ని మాత్రం ట్రెజరీ ద్వారా మాత్రమే చెల్లింపులు చేయాల్సి ఉంటుంది. అలాగే కేంద్ర పథకాలు, ఎక్స్‌టర్నల్లీ ఎయిడెడ్ ప్రాజెక్టులు, ఆర్థిక సంఘం నిధులు వంటి వాటిల్లో అవలంభించాల్సిన విధానాలపైనా మార్గదర్శకాల్లో స్పష్టమైన సూచనలు చేసింది. ఈ సూచనలన్నీ ఏప్రిల్ ఒకటి నుంచి జులై 31 వరకు వర్తిస్తాయని తన ఉత్తర్వుల్లో ఆర్థికశాఖ పేర్కొంది.

రూ. 113 కోట్లకు బిల్లుల్లేవు

- రాష్ట్రానికి అక్కౌంటెంట్ జనరల్ లేఖ

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

వేల కోట్లు ఖర్చు చేస్తున్నా... అందుకు తగినట్లుగా బిల్లులు సిద్ధంచేయడంలో ఆర్థిక శాఖ విఫలమవుతోంది. అత్యవసర పరిస్థితుల్లో ఖర్చు చేసేందుకు వాడుకుంటున్న నిధులపై పూర్తి స్థాయి బిల్లులను సమర్పించడం లేదన్న విమర్శలు పెరుగుతున్నాయి. ఇదే అంశాన్ని ప్రధాన అక్కౌంటెంట్ జనరల్ కార్యాలయం కూడా పదేపదే చెబుతున్నప్పటికీ అధికారులకు మాత్రం పట్టడం లేదు. ఈ నేపథ్యంలో ఎసి బిల్లులుగానే మిగిలిపోతున్న నిధులు ఏమయ్యాయన్నది అర్థం కావడం విమర్శలు వస్తున్నాయి. తాజాగా రూ 113 కోట్ల ఖర్చులకు సంబంధించి డిసి (డీటైల్డ్ కంటింజెంట్) బిల్లులు సమర్పించాలని ఎజి కార్యాలయం రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాసింది. ఈ మొత్తాన్ని ఖర్చు చేసినట్లు అధికారులు చెబుతున్నప్పటికీ పూర్తిస్థాయి బిల్లులు సమర్పించకపోవడంతో సమస్యలు వస్తున్నాయి. మొత్తం 171 బిల్లులకు సంబంధించి ఈ నిధులు ఉన్నట్లు పిఎజి అధికారులు చెబుతున్నారు. ఇవన్నీ గతేడాది సెప్టెంబర్ నుంచి డిసెంబర్ వరకు ఉన్నవేనని గుర్తించారు. వీటికి సంబంధించి మార్చి 31 వరకు ఎటువంటి వివరాలు రాలేదని కూడా పిఎజి అధికారులు చెబుతున్నారు. ఈ మొత్తం బిల్లుల్లో నేరుగా రాష్ట్ర ప్రభుత్వం నుంచే 121 బిల్లుల వివరాలు రావాల్సి ఉందని వారు అంటున్నారు. మరో 49 బిల్లులపై అభ్యంతరాలు ఉన్నాయని పేర్కొన్నారు.

నిర్మాణ రంగాన్ని నిలబెడతా!

(మొదటిపేజీ తరువాయి)

అన్యాయం చేయలేదని పేర్కొన్నారు. జగన్ ఐదేళ్లూ పూర్తిగా కేంద్రానికి సహకారమందించారన్నారు. అమరావతి నిర్మాణం పూర్తయి ఉంటే భూములిచ్చిన రైతుల, రాష్ట్ర ప్రజల జీవితాలు మారిపోయి ఉండేవి. కానీ, జగన్ అన్నింటినీ నాశనం చేశారని విమర్శించారు. అమరావతి పూర్తయి ఉంటే, ప్రభుత్వానికి లక్షల కోట్ల రూపాయల ఆదాయం వచ్చి ఉండేదని, ఆ మొత్తంతో ప్రజలకు మంచి పథకాలతో సంక్షేమాన్ని అందించవచ్చని అన్నారు. మీకు అమరావతి, రాజధాని కావాలా? వద్దా? అని ప్రశ్నించారు. అమరావతి కావాలని ఎమ్మెల్యే శంకరరావు జగన్‌ను ఏనాడైనా అడిగారా? అన్ని నిలదీశారు. లావు శ్రీకృష్ణదేవరాయలు అమరావతికి మద్దతు పలికి వైసిపి నుంచి బయటకు వచ్చారన్నారు. వైసిపికి రాజీనామా చేసిన ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి సత్తెనపల్లి సభలో చంద్రబాబు సమక్షంలో టిడిపిలో చేరారు.

వైసిపికి శింగనమల మాజీ ఎమ్మెల్యే రాజీనామా

ప్రజాశక్తి-నార్పల (అనంతపురం)



వైసిపికి అనంతపురం జిల్లా శింగనమల మాజీ ఎమ్మెల్యే యామినీ బాల శనివారం రాజీనామా చేశారు. ఈ మేరకు ఆమె ఒక వీడియో విడుదల చేశారు. 'తాను వైసిపికి రాజీనామా చేస్తున్నాను. ఇంత కాలం తనకు సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు' అని వీడియోలో పేర్కొన్నారు. 2014 ఎన్నికల్లో టిడిపి తరుపున యామినీ బాల ఎమ్మెల్యేగా గెలిచారు. 2019 ఎన్నికల్లో టికెట్ దక్కకపోవడంతో ఆమె పోటీ చేయలేదు. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత తన తల్లి మాజీ ఎమ్మెల్సీ శమంతకమణితో కలిసి ఆమె వైసిపిలో చేరారు. వైసిపి శింగనమల టికెట్ వ్యవహారంపై గత నెల రోజులుగా ఆ పార్టీలో తీవ్ర అసమ్మతి నెలకొంది. వీరాంజనేయులుకు టికెట్ ఇవ్వడాన్ని యామినిబాలతో సహా అసమ్మతి నేతలు నిరసిస్తున్నారు. అభ్యర్థిని మార్చాలంటూ పార్టీ అధ్యక్షులు జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. అయినా అభ్యర్థిని మార్చకపోవడంతో అసమ్మతి నేతలు ఇప్పటికే రాజీనామా చేస్తామని ప్రకటించారు. తాజాగా యామినీబాల కూడా ఆ పార్టీకి రాజీనామా చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. మరికొందరు కూడా త్వరలో రాజీనామాలు చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం.

అరెస్టులకు భయపడేది లేదు

- మిమ్స్ కార్మికులు, సిఐటియు నాయకులపై అక్రమ కేసులు ఎత్తేయాలి
- సిఐటియు రాష్ట్ర కార్యదర్శి సుబ్బరావమ్మ
- అరెస్టులకు నిరసనగా కలెక్టరేట్ వద్ద ధర్నా



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న సిఐటియు నాయకులు, మిమ్స్ ఉద్యోగులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సమస్యలు పరిష్కరించాలని రెండు నెలలుగాపైగా మిమ్స్ ఉద్యోగులు ఆందోళన చేస్తుంటే యాజమాన్యం స్పందించకపోగా.. 12 మంది సిఐటియు నాయకులపైనా, మిమ్స్ ఉద్యోగులపైనా అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేయడం అన్యాయమని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బరావమ్మ అన్నారు. అరెస్టులు, కేసులకు భయపడేది లేదని తేల్చి చెప్పారు. సిఐటియు నాయకులు, మిమ్స్ ఉద్యోగుల అరెస్టులను నిరసిస్తూ విజయనగరం కలెక్టరేట్ వద్ద సిఐటియు ఆధ్వర్యాన శనివారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సుబ్బరావమ్మ మాట్లాడుతూ మిమ్స్ ఉద్యోగులు, కార్మికులు గొంతెమ్మ కోర్కెలు కోరడం లేదని, చట్ట ప్రకారం వేతన ఒప్పందం చేయాలని, బకాయి ఉన్న డిఎలు చెల్లించాలని, కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలని కోరుతున్నారని తెలిపారు. సమస్యలు పరిష్కరించాల్సిన యాజమాన్యం కార్మికులను బెదిరించడం, పోలీసులను ఉపయోగించి అరెస్టు చేయించడం దుర్మార్గమని తెలిపారు. కేసులు పెట్టి కార్మికులను లొంగదీసుకోవాలని యాజమాన్యం చూస్తోందన్నారు. ఇటువంటి తాటాకు చప్పుళ్లకు కార్మికులు బయపడరని, మిమ్స్ కార్మికులకు సిఐటియు అండగా ఉంటుందని తెలిపారు. మిమ్స్ కార్మికుల సమస్యలు పరిష్కారమయ్యే వరకు పోరాటం ఆగదని స్పష్టం చేశారు. కార్మికులపై పెట్టిన అక్రమ కేసులను తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ధర్నాలో సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు, నాయకులు వి.లక్ష్మి, ఎ.గౌరినాయుడు, సురేష్, త్రినాధ్, ఎ.జగన్మోహన్, మిమ్స్ ఉద్యోగులు పాల్గొన్నారు.

షర్మిల, సునీత విజ్ఞతకే వదిలేస్తున్నా

- వివేకాను నేనే హత్య చేశానడం సరికాదు : అవినాష్

ప్రజాశక్తి-బద్వేలు (వైఎస్‌ఆర్ జిల్లా)

కడప పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో పిసిసి అధ్యక్షులు వైఎస్.షర్మిల తనపై చేసిన వ్యాఖ్యలను ఆమె విజ్ఞతకే వదిలేస్తున్నానని కడప ఎంపి వైఎస్.అవినాష్‌రెడ్డి అన్నారు. వైఎస్‌ఆర్ జిల్లా బద్వేలు నియోజకవర్గం వైసిపి అభ్యర్థి డాక్టర్ సుధ తరుపున శనివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అవినాష్‌రెడ్డి మాట్లాడుతూ.. మాజీ మంత్రి వివేకానందరెడ్డిని తానే హత్య చేశానని షర్మిల, సునీత అనడం సరికాదన్నారు. ఇలాంటి మాటలు వినడానికే భయంకరంగా ఉన్నాయని, షర్మిల, సునీత మాటలను వారి విజ్ఞతకే వదిలేస్తున్నానని తెలిపారు. విజ్ఞత కలిగిన వారెవ్వరూ ఇలాంటి వ్యాఖ్యలు చేయరన్నారు. ఎన్ని మాటలు అంటారో అనండి, ఎంత ప్రచారం చేస్తారో చేయండి, తనకేమీ అభ్యంతరం లేదని చెప్పారు.

బంగారం కొత్త రికార్డులు

ముంబయి : బంగారం ధరలు నూతన రికార్డులను సృష్టిస్తున్నది. శనివారం న్యూఢిల్లీ బులియన్ మార్కెట్లో 24 క్యారెట్ల స్వచ్ఛత కలిగిన 10 గ్రాముల బంగారంపై రూ.1,310 పెరిగి రూ.71,400కు చేరింది. 22 క్యారెట్లపై రూ.1,200 ఎగిసి రూ.65,500గా నమోదయ్యింది.

స్వేచ్ఛాయుత ఎన్నికల బాధ్యత డిఇఓ, ఎస్‌పిలదే

- ముఖేష్‌కుమార్‌మీనా

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికలు శాంతియుతంగా, స్వేచ్ఛగా, న్యాయబద్ధంగా నిర్వహించాల్సిన బాధ్యత జిల్లా ఎన్నికల అధికారులు (డిఇఒలు), ఎస్‌పిలపైనే ఉందని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్‌మీనా పేర్కొన్నారు. సమస్యల సత్వర పరిష్కారం కోసం డిఇఓలు, ఎస్‌పిలు సమన్వయంతో వ్యవహరిస్తూ, సమగ్ర అవగాహనతో సమస్యలను సత్వరమే పరిష్కరించాలని సిఇఓ ఆదేశించారు. రాష్ట్ర సచివాలయం నుంచి శనివారం అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, ఎస్‌పిలు, పోలీస్ కమిషనర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేందుకు చేస్తున్న ఏర్పాట్లు, తీసుకుంటున్న చర్యలు, ఎన్నికల ప్రవర్తనా నియమావళి పటిష్టంగా అమలుపర్చే అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా సిఇఓ మాట్లాడుతూ ఎన్నికల్లో ఎటువంటి హింస, రీ పోలింగ్‌కు తావు లేకుండా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టాలన్నారు. గంజాయి, లిక్కర్, నగదు ఉచిత అక్రమ రవాణాపై పటిష్టమైన నిఘా ఉంచాలని, రాష్ట్రాల సరిహద్దులు, జిల్లాల సరిహద్దుల్లో ఉండే చెక్‌పోస్టుల్లో నిఘా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని ఆదేశించారు. గోవా, హర్యానా నుంచి అక్రమంగా లిక్కర్ రాష్ట్రంలోకి రాకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు, వ్యక్తులు రూ.50 వేలకు మించి నగదు కలిగి ఉంటే వెంటనే జప్తు చేయాలని, వ్యాపారులు, సాధారణ పౌరుల విషయంలో ఆచితూచి అడుగువేయాలన్నారు. నగదు జప్తు కేసులను 24 గంటల్లోనే పరిష్కరించాలని, అందుకోసం రాష్ట్రమంతా ఒకే విధానాన్ని అనుసరించేలా త్వరలో స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసిడ్యూర్ (ఎస్ఓపి)ని రూపొందించి కమ్యూనికేట్ చేయనున్నట్లు సిఇఓ తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు ఇంటింటి ప్రచారానికి సంబంధించి ముందస్తుగా పొందాల్సిన అనుమతి విషయంలో స్పష్టత కోసం కేంద్ర ఎన్నికల సంఘానికి ప్రతిపాదనలు పంపామని చెప్పారు. ఈ అంశంపై వివరణ అందేలోగా ముందస్తు సమాచారాన్ని సంబంధిత ఆర్‌ఓ, ఆ పరిధిలోని పోలీస్ స్టేషన్‌కు సమాచారమిస్తే సరిపోతుందని రాజకీయ పార్టీలకు తెలపాలని డిఇఓ, ఎస్‌పిలకు సూచించారు. కేంద్ర ఎన్నికల సంఘం రాష్ట్రానికి ముగ్గురు ప్రత్యేక పరిశీలకులను నియమించిందని, వీరు నేరుగా ప్రధాన ఎన్నికల కమిషనర్ నేతృత్వంలో పనిచేస్తుంటారని చెప్పారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘన ఫిర్యాదులపై తక్షణమే చర్యలు చేపట్టాలని, తాము పంపే ఫిర్యాదులపై జిల్లాస్థాయిలోనే సమగ్రమైన విచారణ జరిపి చర్యలు తీసుకున్న అనంతరమే నివేదిక పంపాలని సిఇఓ ఆదేశించారు. రాష్ట్ర పోలీస్ నోడల్ అధికారి, అదనపు డిజిపి (లా అండ్ ఆర్డర్) శంకబ్రాతబాగ్చీ మాట్లాడుతూ రూ.10 లక్షలకు పైబడి జప్తు చేయబడిన నగదు, బంగారం, ఇతర విలువైన వస్తువుల సమాచారాన్ని ఎప్పటికప్పుడు ఐటి అధికారులకు తెలియజేయాలన్నారు. రాష్ట్రాల సరిహద్దులు, జిల్లాల సరిహద్దుల్లో ఉండే చెక్ పోస్టుల్లో నిఘాను పటిష్టం చేయాలని ఆదేశించారు. అదనపు సిఇఓ పి.కోటేశ్వరరావు, అదనపు సిఇఓ ఎమ్ఎన్ హరీంధర్‌ప్రసాద్ తదితరులు మాట్లాడారు. ఈ సమావేశంలో అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, పోలీస్ సూపరింటెండెంట్లు, పోలీస్ కమిషనర్లు, జాయిర్ సిఇఓ ఎ.వెంకటేశ్వరరావు, డిప్యూటీ సిఇఓ కె.విశ్వేశ్వరరావు, అసిస్టెంట్ సిఇఓ తాతబ్బాయి పాల్గొన్నారు.

జగన్ మళ్లీ గెలిస్తే రాష్ట్రానికి అధోగతే

- టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు యనమల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

జగన్ మళ్లీ అధికారంలోకి వస్తే రాష్ట్రానికి అధోగతేనని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు పేర్కొన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరం రెండో రోజే ఆర్‌బిఐ నుంచి ప్రభుత్వం సెక్యూరిటీల వేలంలో రూ.4 వేల కోట్లు అప్పులు తెచ్చిందని శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023-24లో ఆర్‌బిఐ నుంచే రూ.70వేల కోట్ల అప్పులు చేసి ఐదేళ్లలో రూ.13 లక్షల కోట్ల అప్పుల్లో రాష్ట్రాన్ని జగన్ ముంచారని పేర్కొన్నారు. కాగ్ లెక్కల ప్రకారమే రోజుకు రూ.257 కోట్లు చొప్పున గతేడాది రూ.93,805 కోట్లు అప్పు చేసిందని తెలిపారు. బడ్జెట్‌లో శాసనసభకు చెప్పి చేస్తామన్న అప్పులు, ఎఫ్ఆర్‌బిఎం పరిమితులు కంటే ఇది రెండింతలు ఎక్కువ అని చెప్పారు. దక్షిణాది రాష్ట్రాలైన కేరళ, తమిళనాడు, కర్ణాటక పేదరిక నిర్మూలనలో మనకంటే ఎంతో మెరుగైన స్థానాల్లో ఉన్నాయని పేర్కొన్నారు. అభివృద్ధితో కూడిన సంక్షేమం అందించే కూటమిని గెలిపించాలని కోరారు. ఐదేళ్ల నుంచి బ్రాహ్మణులను అణగదొక్కుతున్న జగన్‌కు ఎన్నికల ముందే గుర్తుచ్చొరా అని టిడిపి బ్రాహ్మణ సాధికార సమితి కన్వీనర్ బుచ్చి రాంప్రసాద్ ప్రశ్నించారు. టిడిపి కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కార్పొరేషన్ ద్వారా ఒక్కరికైనా రుణమిచ్చారా? గత ఎన్నికల్లో ఇచ్చిన ఒక్క హామీనైనా అమలు చేశారా అని ప్రశ్నించారు. అవ్వాతాతలకు పింఛన్ డబ్బులు ఆలస్యం చేసిన జగన్ తన బినామీలకు మాత్రం వారం ముందే డబ్బులు దోచిపెట్టారని టిడిపి కార్య నిర్వాహక కార్యదర్శి నాదెండ్ల బ్రహ్మం ఆరోపించారు. పంపిణీ ఆలస్యం చేసి వృద్ధుల మరణానికి కారణమైన వారిపై క్రిమినల్ కేసు నమోదు చేసి సమగ్ర దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు.

బాబాయ్ హత్యపై జగన్ మౌనం ఎందుకు?

- ముస్లిములకు కాంగ్రెస్ అండ
- రెండో రోజు బస్సుయాత్రలో వైఎస్.షర్మిల

ప్రజాశక్తి - కడప



బస్సుయాత్రలో మాట్లాడుతున్న వైఎస్.షర్మిల

వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో అవినాష్‌రెడ్డిని సిబిఐ నిందితుడిగా తేల్చిందని పిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల అన్నారు. బాబాయ్ హత్య విషయంలో జగన్‌మోహన్‌రెడ్డి ఎందుకు మౌనంగా ఉన్నారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. హత్యా రాజకీయాలు ప్రోత్సహించే వారికి ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పాలని కోరారు. తన పుట్టుక మీద సోషల్ మీడియాతో దుష్ప్రచారం చేస్తున్న సిఎం జగన్ పట్టించుకోలేదని విమర్శించారు. తన తల్లిని కూడా అవమానిస్తున్నారని చెప్పారు. వైఎస్‌ఆర్ జిల్లా కడప నియోజకవర్గంలో రెండో రోజు బస్సుయాత్ర కొనసాగింది. తొలుత పెద్దదర్గా, దేవునికడప, సిఎస్‌ఐ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. యాత్ర సందర్భంగా పలుచోట్ల ఆమె మాట్లాడుతూ..ముస్లిములను, ప్రజలను ఆదరించి వారికి అండగా నిలిచే పార్టీ కాంగ్రెస్ అని చెప్పారు. మాజీ సిఎం రాజశేఖర్‌రెడ్డి ముస్లిములను ఎంతగానో ప్రేమించే వారని, వారికి నాలుగు శాతం రిజర్వేషన్ కల్పించి అన్ని విధాలుగా సహాయం చేశారని తెలిపారు. ముస్లిములకు అన్యాయం చేసిన బిజెపితో వైసిపి, టిడిపిలు రహస్య ఒప్పందం చేసుకొని బానిసలుగా మారి రాష్ట్రానికి తీరని అన్యాయం చేశాయని ఆరోపించారు. వైఎస్.రాజశేఖర్‌రెడ్డి బతికి ఉంటే రాష్ట్రం విడిపోయేది కాదన్నారు. కడపలో స్టీల్ ఫ్యాక్టరీ ఎప్పుడో వచ్చేదని, టిడిపి, వైసిపి పాలనలో శంకుస్థాపనలకే ఈ ఫ్యాక్టరీ పరిమితమైపోయిందని వివరించారు. ఎంపిగా జిల్లా ప్రజలకు, జిల్లాకు వైఎస్.అవినాష్‌రెడ్డి ఏం చేశారని ప్రశ్నించారు. కార్యక్రమంలో పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి, డిసిసి అధ్యక్షులు శ్రీరాములు, డిసిసి మాజీ అధ్యక్షులు నజీర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన పూతలపట్టు ఎమ్మెల్యే

చిత్తూరు జిల్లా పూతలపట్టు వైసిపి ఎమ్మెల్యే ఎం.ఎస్.బాబు కాంగ్రెస్‌లో చేరారు. పిసిసి అధ్యక్షులు వైఎస్.షర్మిల సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కండువా కప్పి ఆయనను షర్మిల పార్టీలోకి ఆహ్వానించారు. వైసిపి తరుపున డాక్టర్ సునీల్‌కు సీటు కేటాయించడంతో ఆయన పార్టీపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. కార్యకర్తలతో చర్చించి, వారి అభిప్రాయం తీసుకుని కాంగ్రెసులో చేరినట్లు సమాచారం. ఈ నియోజకవర్గం నుంచి ఒకసారి గెలిచిన వారు మరోసారి గెలిచే అవకాశం లేకపోవడంతో బాబుకు కాకుండా వైసిపి మరో అభ్యర్థికి సీటు కేటాయించింది.

23 సీట్లకే పవన్ ముఖ్యమంత్రి అవుతారా?

- కాపు నేత ముద్రగడ పద్మనాభం

ప్రజాశక్తి - తణుకు (పశ్చిమగోదావరి జిల్లా)

జనసేన అధినేత పవన్ కల్యాణ్ 23 అసెంబ్లీ సీట్లతో ఎలా ముఖ్యమంత్రి అవుతారని మాజీ మంత్రి, కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం ప్రశ్నించారు. పశ్చిమగోదావరి జిల్లా తణుకులోని కమ్మ కల్యాణ మండపంలో కాపు ఆత్మీయ సమ్మేళనం శనివారం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఈ మధ్య పవన్ కల్యాణ్ మాట్లాడే మాటలు బాధ కలిగిస్తున్నాయని, క్లబ్‌లు నడిపే వాళ్లతో తనను తిట్టిస్తున్నారని, దమ్ము, ధైర్యం ఉంటే ప్రెస్‌మీట్ పెట్టి తిడితే దానికి సమాధానం చెబుతానని తెలిపారు. తాను మాట్లాడే మాటలకు పవన్ కల్యాణ్ సమాధానం చెప్పాలని సవాల్ చేశారు. సిఎం జగన్ పిలుపు మేరకే తాను వైసిపిలో చేరానని, తనకు ఎలాంటి కోరికలు లేవని తెలిపారు. వైసిపిని అధికారంలోకి తీసుకురావడానికి కార్యకర్తలు కష్టపడి పని చేయాలని, జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సిఎంను చేయాలని కోరారు. మంత్రి కారుమూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ జగన్ అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి వైసిపిని గెలిపించాలని కార్యకర్తలకు సూచించారు. మళ్లీ జగనే ముఖ్యమంత్రి అవుతారని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్, నరసాపురం వైసిపి ఎంపి అభ్యర్థి గూడూరి ఉమాబాల, ఏలూరు పార్లమెంట్ అభ్యర్థి కారుమూరి సునీల్, నాయకులు పాల్గొన్నారు.

ఆందోళనకరంగా నిరుద్యోగం

- ప్రముఖ ఆర్థికవేత్త ఎస్.మహేంద్రదేవ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో నిరుద్యోగం ఆందోళనకర స్థాయికి చేరిందని ప్రముఖ ఆర్థికవేత్త ప్రొఫెసర్ ఎస్. మహేంద్రదేవ్ అన్నారు. సిటిజన్స్ ఫర్ డెమోక్రసి ఆధ్వర్యంలో శనివారం విజయవాడలోని బాలోత్సవ్ భవనంలో 'అభివృద్ధితో సంక్షేమం-సుపరిపాలనకు సవాళ్లు' అనే అంశంపై చర్చా గోష్ఠి నిర్వహించారు. ఈసదస్సులో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 30 శాతానికి పైగా నిరుద్యోగ యువత ఉన్నారని చెప్పారు. పరిశ్రమలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాలు పెరిగితేనే ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని చెప్పారు. సమాజంలో అభివృద్ధి, ప్రగతిని సాధించటం ద్వారానే సంక్షేమాన్ని అమలు చేయగలమని చెప్పారు. అభివృద్ధికి తోడ్పడే సంక్షేమ పథకాలను అమలు చేయాలని సూచించారు. రాష్ట్రంలో అప్పులు గణనీయంగా పెరిగిపోయాయని, బడ్జెట్ కేటాయింపుల్లో వేలాది కోట్లు కేవలం వడ్డీలు చెల్లించేందుకు వ్యయం చేయాల్సి వస్తోందని చెప్పారు. ప్రపంచ తలసరి ఆదాయంలో ఇండియా 130వ స్థానంలో ఉందని, దేశంలో ఒక్కశాతం ప్రజల దగ్గర 40 శాతం సంపద కేంద్రీకృతమవటం తీవ్ర అసమానతలకు దారితీస్తోందని అభిప్రాయపడ్డారు. మాజీ సిఎస్ ఎల్. సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ, వ్యక్తిగత ప్రయోజనాలకన్నా సమాజ ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. ఎన్నికల సమయంలో రాజకీయ వైరుధ్యాలు ఉన్నా.. ఎన్నికల తర్వాత అంతా ఐక్యంగా అభివృద్ధికి కృషి చేయాలని చెప్పారు. వలంటీర్ల వ్యవస్థ హానికరమైనదే కాకుండా చట్టవిరుద్ధమైనది, అనైతికమైనదని సిటిజన్స్ ఫర్ డెమొక్రసీ ప్రధాన కార్యదర్శి నిమ్మగడ్డ రమేష్ కుమార్ అన్నారు. వలంటీర్ల వ్యవస్థ వల్ల ఏటా దాదాపు రెండు వేల కోట్ల రూపాయల భారం రాష్ట్ర ప్రజల నెత్తిపై పడిందని వివరించారు. సిటిజన్స్ ఫర్ డెమొక్రసి సంయుక్త కార్యదర్శి వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి, విజయవాడ మాజీ మేయర్ జంధ్యాల శంకర్, జాస్తి వీరాంజనేయులు, గోళ్ల నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

మేనిఫెస్టోలు ఎప్పుడు?

- వాయిదాలు వేస్తున్న వైసిపి, టిడిపి
- గత ఎన్నికల్లో ఒకేరోజు విడుదల చేసిన ఇరు పార్టీలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఎన్నికల మేనిఫెస్టో విడుదలపై ప్రధాన పార్టీలు వాయిదాల పర్వం కొనసాగిస్తున్నాయి. రేపోమాపు అంటున్నాయే తప్ప ఎప్పుడు విడుదల చేస్తాయో చెప్పడం లేదు. ఎవరు ముందు ప్రకటిస్తే వారిని చూసి కాపీ కొట్టే ఆలోచనలో ఇరు పార్టీలు ఉన్నాయా? అనే అనుమానం కలుగుతుందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. 2019 ఎన్నికల సమయంలోనూ టిడిపి, వైసిపి ఎన్నికలకు ఐదు రోజులు ముందు ఒకేరోజు మేనిఫెస్టోను ప్రకటించాయి. ఏప్రిల్ 6వ తేదీ ఉగాది రోజు ఆయా పార్టీల అధినేతలు చంద్రబాబు, జగన్ విడుదల చేశారు. అప్పటి వరకు రూ.2 వేలుగా ఉన్న సామాజిక పింఛన్‌ను రూ.3 వేలకు పెంచుతామని హామీ ఇచ్చాయి. వీటితోపాటు ప్రతియేటా ఉద్యోగాల భర్తీ, రైతులకు వడ్డీ లేని రుణాలు, వ్యవసాయానికి పగటి పూట ఉచిత విద్యుత్, ధరల స్థిరీకరణ నిధి వంటి హామీలను రెండు పార్టీలూ ఇచ్చాయి. ప్రస్తుతం మేనిఫెస్టో అంశంపై ప్రధాన ప్రతిపక్షమైన టిడిపి ముందుంది. 'భవిష్యత్‌కు గ్యారెంటీ' పేరుతో సూపర్ సిక్స్ పథకాలతో తొలిదశ మేనిఫెస్టోను ఆ పార్టీ విడుదల చేసింది. 'తల్లికి వందనం' ప్రస్తుతం అమలు చేస్తున్న అమ్మ ఒడి పథకానికి, స్త్రీనిధి పథకం వైఎస్‌ఆర్ చేయూతకు కాపీ అని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అంతకుముందు పూర్తిస్థాయి మేనిఫెస్టోను దసరాకు విడుదల చేస్తామని చంద్రబాబు వెల్లడించినప్పటికీ ఆ సమయానికి స్కిల్ కేసులో ఆయన అరెస్టయ్యారు. తర్వాత జనసేనతో కలిసి సంక్రాంతి నాటికి ఉమ్మడి మేనిఫెస్టో విడుదల చేస్తాయని ప్రకటించినా విడుదల చేయలేదు. మరలా ఈ రెండు పార్టీలతో బిజెపి జతకలిసింది. మార్చి 17న చిలకలూరిపేటలో జరిగిన టిడిపి - జనసేన - బిజెపి కూటమి సభకు ముఖ్యఅతిథిగా ప్రధాన మంత్రి నరేంద్రమోడీ హాజరయ్యారు. మోడీ రాష్ట్ర విభజన చట్టంలోని కొన్నింటినైనా హామీలుగా ఇస్తారని ఎదురుచూసిన టిడిపి-జనసేనకు నిరాశే మిగిలింది. టిడిపి తొలిదశలో ప్రకటించిన మేనిఫెస్టోకు మూడు పార్టీలు ఏయే అంశాలను జతచేస్తాయో వేచి చూడాల్సి ఉంది.

2019 ఎన్నికలకు సుమారు ఏడాదిన్నర ముందే నవరత్నాలు పేరుతో వైసిపి కొన్ని హామీలను ప్రకటించింది. ప్రస్తుతం అధికారంలో ఉన్న ఆ పార్టీ మేనిఫెస్టో విడుదలలో వెనుకబడింది. 'జగన్ చెప్పాడంటే చేస్తాడంతే' నినాదంతో ఆ పార్టీ మేనిఫెస్టోపై కసరత్తు పూర్తిచేసినట్లు పార్టీ నాయకులు చెబుతున్నారు. అనంతపురంలో జరిగిన సిద్ధం సభలో ఆ పార్టీ అధినేత వైఎస్ జగన్ మేనిఫెస్టో విడుదల చేస్తారని ముందుగా ప్రచారం జరిగినా విడుదల కాలేదు. ప్రకాశం జిల్లా మేదరమెట్ల సభలో విడుదల చేస్తారని మరోసారి చెప్పినా అది వాస్తవ రూపంలో దాల్చలేదు. 2019లో లానే రెండు పార్టీల మేనిఫెస్టోల్లో ఒకేవిధమైన హామీలు ఏమైనా ఉంటాయా? లేదో చూడాల్సి ఉంది.

న్యాయం కోసమే నా పోరాటం

- వైఎస్ సునీత

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

హంతకులు, వారికి సహకరించేవారు అధికారంలో ఉంటే ప్రజలకు న్యాయం జరగదని వైఎస్ వివేకానంద కుమార్తె సునీత అన్నారు. న్యాయం కోసం తనలా మరొకరు ఇబ్బందులు పడకూడదనే గత ఐదేళ్లుగా పోరాడుతున్నానని చెప్పారు. వైఎస్ వివేకానందరెడ్డి హత్యకు ముందు, తర్వాత పరిస్థితులు వివరిస్తూ 'జస్టిస్ ఫర్ వివేకా' పేరుతో శనివారం హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో సునీత పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. సిబిఐ, కోర్టులలో న్యాయం ఆలస్యం అవుతుందని, అందుకే ప్రజాక్షేత్రంలో పోరాటం చేస్తున్నానని చెప్పారు. అవినాష్‌రెడ్డి లాంటి హంతకులు చట్టసభలకు వెళ్లరాదనేదే తన ధ్యేయం అని తెలిపారు. 2019 ఎన్నికల్లో అవినాష్‌రెడ్డి విజయం కోసం తన తండ్రి పనిచేసినా రాజకీయ కుట్రలో భాగంగా ఎన్నికల్లో సానుభూతి కోసం హత్య చేశారని ఆరోపించారు. తన కుటుంబం అటువంటి పని చేయదని గుడ్డిగా నమ్మానని, వాస్తవాలు తెలిశాక వారిపై అసహ్యమేసిందని చెప్పారు.

సంపాదకీయం


మాటల మూటలు

మాటలను ఆచితూచి మాట్లాడటంలో నేర్పు, నిజాయితీ కావాలి. ముఖ్యంగా అర్థజ్ఞానం, శబ్దజ్ఞానం కావాలి. ఈ దృష్టితోనే పూర్వమో పండితుడు తన కొడుకుతో 'యద్యపి బహునా ధీషే తథాపి పఠపుత్ర! వ్యాకారణమ్, స్వగణ్ణ శ్వగణో మాభూత్' అన్నాడట. అంటే... అనేక విషయాలు సరిగా తెలుసుకోవాలంటే వ్యాకరణం నేర్చుకొమ్మన్నాడు. దీనిలో 'స్వగణం' అంటే మనవాళ్లు, బంధువులు. 'శ్వగణం' అంటే కుక్కల గుంపు అని అర్థం. ఉచ్చారణ భేదంవల్ల, రాయడంలోని పొరబాటు వల్ల అర్థాలు మారిపోతాయి. మచ్చుకు 'పలనాటి వీరచరిత్ర'లో 'జననితో సమమైన జంతువులేదు' అంటాడు బాలచంద్రుడు. ఆశుకవిత్వంలో యతికోసం తల్లిని జంతువన్నాడు. వేదాంతుల దృష్టిలో మనమంతా పశువులమే కావొచ్చు. లేదా శివుడొక్కడే పశుపతి కావొచ్చు. అంతమాత్రాన ఈ ప్రయోగం బాగుందనగలమా? మన ఆలోచనలున్నంత స్పష్టంగా మాటలూ వాటి అర్థాలూ వుంటేనే ఎదుటివ్యక్తికి మన భావాలు తెలుస్తాయి. సగటు మనిషికీ... కవులు, రచయితలకు మధ్య గల భేదాన్ని వారి భాషను బట్టి, వాటి అర్థాల స్పష్టతను బట్టి గుర్తించవచ్చు. కానీ, మన రాజకీయ నాయకులు ఉపన్యాసాల్లో చెప్పే మాటలకు అర్థాలు ఏ డిక్షనరీల్లోనూ దొరకవు. వాటికి పర్యాయపదాలూ వుండవు. సామాన్యులకు మాటలు, సంపన్నులకు మూటలు కట్టబెట్టడం మన పాలకులకు వెన్నతో పెట్టిన విద్య. 'ఎన్ని ఓట్లు వచ్చాయన్నదే లెక్కకాని, ఎంత సారా ఖర్చయిందన్నది లెక్క కాదే' అంటారు రావిశాస్త్రి. ఏదోవిధంగా అధికారం దక్కించుకోడమే వారి లక్ష్యం.

ఎన్నికల్లో ప్రజలకు ఎన్నెన్నో వాగ్దానాలు చేసి, ఎన్నికల తర్వాత గాలికొదిలేసిన అనేక రాజకీయ పార్టీలను చూస్తున్నాం. ఎన్ని వాగ్దానాలు చేసినా... వాటికి చట్టబద్ధత వుండదు కనుక ఇబ్బడిముబ్బడిగా వాగ్దానాలు చేస్తూనే వుంటారు. 'ఎన్నికలలో ఎన్ని కలలో?/ ఒక్క చేపకై ఎన్ని వలలో' అని బాపురెడ్డి అన్నట్టుగా... మాటలతో, ప్రలోభాలతో మభ్యపెడుతూనే వుంటారు. ప్రతి రాజకీయపక్షానికి తన సిద్ధాంతాలకు అనుగుణమైన లక్ష్యాలు వుంటాయి. ఆ లక్ష్యసాధనకు ఉపకరించే కార్యక్రమాలను రూపొందించుకుంటారు. వాటిని ప్రజలకు వివరించి, అధికారం ఇమ్మని కోరుకుంటారు. అధికారంలోకి వస్తే... తమ వాగ్దానాలన్నీ అమలు చేస్తామని అలవిగాని హామీలిస్తారు. ఆ తర్వాత చెత్తబుట్టలో పడేస్తారు. 'చెప్పేదొకటి/ చేసేదొకటి కారాదోయ్/ మాటల మనిషివే కాకోయ్/ చేతల మనిషివి కావోయ్' అంటాడో కవి. దేశంలోని అనేక రాష్ట్రాలలో పాలక పార్టీలన్నీ తమ మ్యానిఫెస్టోలను పథకాల చుట్టూనే తిప్పుతున్నాయి. బిజెపి మరో రెండడుగులు ముందుకేసి ఒక చంకలో కార్పొరేట్ శక్తులను, మరో చంకలో మతాన్ని అంటిపెట్టుకొని భారత్ వెలిగిపోతోందంటూ ప్రచారం చేస్తోంది. మరోవైపు సంక్షేమ పథకాల పట్ల తన వ్యతిరేకతను బాహాటంగానే ప్రదర్శిస్తోంది. 'మాన్పగలిగితి కత్తికోతలు,/ మాన్ప వశమే, మాట కోతలు?/ కత్తి చంపును, మాట వాతలు/ మాన వేనాడున్' అంటారు గురజాడ. మాటలు మూటలు గాలిలో కలిసిపోగా, ప్రపంచ ఆకలి సూచీలో, నిరుద్యోగం వంటి అనేక విషయాల్లో భారత్ అథమస్థానంలో వుందని లెక్కలు చెబుతున్నాయి. మట్టిగుర్రాన్ని నమ్ముకుని ఏట్లోకి దిగిన చందంగా మారింది దేశం పరిస్థితి.

ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోవడంలేదు. మ్యానిఫెస్టోలు ఒట్టి కాగితాలుగానే మిగిలిపోతున్నాయి. అందుకే, రాజకీయ పార్టీల మ్యానిఫెస్టోలకు ఆయా పార్టీలు జవాబుదారీగా వుండాలి. నిబద్ధత కలిగిన సిపిఐ(ఎం) వంటి రాజకీయ పార్టీలు తమ విధానాన్ని బాహాటంగానే చెబుతారు. అధికారంలోకొచ్చిన తర్వాత ఆచరించి చూపుతారు. అలాంటి చిత్తశుద్ధి రాజకీయ నేతలకు అవసరం. 'వట్టి మాటలు కట్టి పెట్టోయ్/ గట్టి మేల్ తలపెట్టవోయ్' అని గురజాడ అన్నట్టుగా ప్రతి రాజకీయ పార్టీ, నాయకుడు ఒట్టి మాటలను కట్టి పెట్టి ఎన్నికలలో ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చాలి. 'ఐక్యం అదీ వ్యవస్థ/ అప్పుడుండదు మనకీ అవస్థ/ అనేకం అయితే ఏకం/ అదే వివేకం' అంటాడు మహాకవి శ్రీశ్రీ. కార్పొరేట్– మతతత్వ కూటమిని మట్టికరిపించేందుకు వివిధ లౌకిక, ప్రజాస్వామ్య శక్తులు ఒకతాటిపైకి రావడం అవసరం. ప్రజానుకూల విధానాలకు, మతసామరస్యానికి ఒక ఆశాకిరణంలా నిలిచిన కేరళ ఈ దేశానికి ఆదర్శం కావాలి.

మంచి మాట



చదరంగంలో మాదిరిగానే
జీవితంలో కూడా
ముందుచూపు ఎంతో అవసరం.
- కందుకూరి వీరేశలింగం,
సంఘ సంస్కర్త.

మోడీ బిల్డప్‌నే మోయడం అవసరమా?

ప్రస్తుతం



తెలకపల్లి రవి

భారత దేశంలో, పాలక వ్యవస్థలన్నీ కలసి నరేంద్ర మోడీ బిజెపి ప్రభుత్వాన్ని మూడోసారి ప్రతిష్టించడానికి పథకాలు వేస్తున్నాయి. ఎన్నికలలో ఓటు వేసి గెలిపించవలసిన ప్రజలను అందుకు మానసికంగా సిద్ధం చేయాలనుకుంటున్నాయి. నిజానికి మోడీని త్రీడీలో తీసుకువచ్చిన మొదటి రోజు నుంచి ఈ వ్యూహం వుంది. ఇప్పుడు ఆయన మూడవసారి అధికారంలోకి రావడం అనివార్యమనే మోత పరమార్థం అదే. ఎలాగూ గెలిచే మోడీని ఎదుర్కోవడం వృథా అని నూరిపోయడం అందులో భాగమే. తెలుగు నాట సీనియర్ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా అదే తరహాలో మోడీని మోయడం అనివార్యమని నమ్ముతూ ఆ ప్రచారానికి ఊతమిస్తున్నారు. గత పదేళ్ల నుంచి మోడీకే వత్తాసునిస్తున్న ముఖ్యమంత్రి జగన్ కూడా బిజెపి జోలికి పోకుండా తన వంతు సహాయం అందిస్తున్నారు. ఇక తెలంగాణలో ఓటమిపాలైన మాజీ సిఎం కెసిఆర్ కూడా కాంగ్రెస్‌నే ఏకైక శత్రువుగా భావిస్తూ బిజెపికి పరోక్షంగా సహకరిస్తున్నారు. జాతీయ మీడియా దాదాపుగా మోడియాగా మారిపోగా తెలుగు మీడియా కూడా ప్రాంతీయంగా తమకు నచ్చిన వారికి మద్దతిస్తూ జాతీయ స్థాయిలో బిజెపికి అనుకూలమైన రాగాలే వినిపిస్తున్నది. ఏతావాతా బిజెపి హ్యాట్రిక్ విజయం గురించిన గొప్పలు వారికన్నా ఎక్కువగా ఈ శక్తులు ప్రచారం చేస్తున్నాయి. వామపక్షాలు గానీ, బిజెపి ఎన్‌డిఎకు వ్యతిరేకంగా ఏర్పాటైన 'ఇండియా' దండగమారి ప్రయత్నమనీ, వామపక్షాలు ఏదో సైద్ధాంతికంగా వ్యతిరేకించడం తప్ప చేయగలిగింది లేదనీ అహోరాత్రులు అపహాస్యం చేస్తున్నాయి. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాలుగా పోరాడటం జరుగుతుందనే కనీస ప్రజాస్వామిక సంప్రదాయాన్ని కూడా భరించలేక పోతున్నాయి.

రాజకీయ ప్రత్యామ్నాయాల నేపథ్యమేమిటి?

నిజంగానే ఇది చాలా విడ్డూరమైన పరిస్థితి. దేశ విదేశాలలోని గుత్తాధిపతులు మోడీ రాక కోసం ఎందుకంత పరితపిస్తున్నారనేది ఆలోచించవలసిన అంశం. గతంలో కాంగ్రెస్ అవిచ్ఛిన్నంగా ముప్పై ఏళ్లు దేశాన్ని పాలించింది. ప్రతిపక్షాలకు చాలా తక్కువ సీట్లే వుండేవి. బెంగాల్, కేరళ, తమిళనాడు, పంజాబ్ వంటి చోట్ల తప్ప బలమైన ప్రత్యామ్నాయ పక్షాలు, కూటములు కూడా వుండేవి కావు. అయినా ప్రతి ఎన్నికలోనూ కాంగ్రెస్‌ను ఓడించేందుకు విస్తారమైన ప్రయత్నం జరిగేది. అందుకు గల అవకాశాలకు తగినట్టు వేదికలను ఏర్పాటు చేయడం జరుగుతుండేది. ఆ క్రమంలోనే 1957లో కేరళలో ఇఎంఎస్ నంబూద్రిపాద్ నాయకత్వాన తొలి కాంగ్రెసేతర కమ్యూనిస్టు ప్రభుత్వం ఏర్పడింది. 1967 నాటికి ఎనిమిది రాష్ట్రాలలో కాంగ్రెసేతర ప్రభుత్వాలొచ్చాయి. ఇందిరా గాంధీ ఎమర్జన్సీ తర్వాత 1977లో ప్రతిపక్షాల ఐక్యత దాన్ని ఓడించడానికి దారితీసింది. రాష్ట్రాలలోనూ కేంద్రంలోనూ ఏర్పడిన ఈ ప్రభుత్వాలు పూర్తి కాలం సాగకుండా కాంగ్రెస్ కుట్రలు చేసింది. ప్రతిపక్షాల అనైక్యతా అందుకు దోహదం చేసింది. ఎమర్జన్సీతో ఓడిపోయిన ఇందిరా గాంధీ తిరిగి అధికారంలోకి రాగలిగారు. ఆమె దారుణ హత్య తర్వాత ఆమె కుమారుడు రాజీవ్ గాంధీ సానుభూతి వెల్లువలో చరిత్రలోనే లేనంత పెద్ద మెజారిటీతో అంటే 400 పైన స్థానాలతో ప్రధాని అయ్యారు. ఇప్పుడు పాలన చేస్తున్న బిజెపికి ఆ ఎన్నికల్లో రెండంటే రెండు సీట్లే వచ్చాయి. ఆ 1984 ఎన్నికల్లో బెంగాల్‌లో సిపిఎం, ఎ.పి లో ఎన్టీఆర్ నేతృత్వంలో టిడిపి మాత్రమే నిలబడగలిగాయి. అంతేగానీ పలాయన మంత్రం పాడింది లేదు. 1989లో వి.పి.సింగ్ ప్రభుత్వం కూడా వచ్చింది. రాజీవ్ గాంధీ హత్య తర్వాత మళ్లీ పి.వి నరసింహారావు మైనార్టీ ప్రభుత్వం వచ్చింది. ఈ కాలంలోనే బిజెపి మత రాజకీయాలను అయోధ్య వంటి సమస్యలనూ పెంచుతూ శక్తి పెంచుకున్నది. 1989, 1996-97 లలో కేంద్రంలో విఫల యత్నాలు చేసి 1998లో తొలిసారి అధికారం చేపట్టగలిగింది. మారిపోయిన తెలుగుదేశం అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు మద్దతు అందుకు ప్రధాన కారణమైంది. వాజ్‌పేయి పాలనా సమర్థతలో దేశం వెలిగిపోతుంది అని ప్రచారం మోగించిన కాలం కూడా మర్చిపోలేము. 2004లో మళ్లీ యుపిఎ సర్కారు ఏర్పడే వరకూ చంద్రబాబు వారికే మద్దతుగా వున్నారని మర్చిపోరాదు. వాజ్‌పేయికి స్వంతంగా మెజార్టీ లేని మాట నిజమే గాని బలపరిచే పార్టీలు చాలా వుండేవి. అయినా ఓటమిపాలు కాక తప్పు లేదు. తర్వాత మన్మోహన్ సింగ్ నాయకత్వంలో వామపక్షాల మద్దతుతో యుపిఎ ప్రభుత్వం ఏర్పడింది. 2009లో యుపిఎ గానే ప్రభుత్వం ఏర్పాటు చేశారు.


అవకాశవాదం అనర్థం

అనేక ప్రాంతీయ పార్టీల అవకాశవాదం, కాంగ్రెస్ బలహీనపడటం, వామపక్షాలు ప్రతికూల పరిస్థితిలో పడటం, దేశంలో పాలక వర్గాలు మతవాద మితవాద రాజకీయాలను ప్రోత్సహించడం, సరళీకరణ విధానాలు అనివార్యంగా మత మార్కెట్ తత్వాలను ప్రోత్సహించడం వంటి కారణాల వల్ల బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్‌లు పట్టు పెంచుకున్న మాట నిజం. దేశ విదేశీ గుత్తాధిపతులు, ఫైనాన్స్ పెట్టుబడి శక్తులు కూడా ఆయనకు దన్నుగా నిలిచిన మాటా నిజం. ప్రపంచీకరణ నేపథ్యంలో ప్రజాస్వామిక విలువలనే బలహీనపరిచే ప్రయత్నాలు కూడా కాదనలేనివి. అయితే ఈ కారణాలన్నీ ప్రత్యామ్నాయం కోసం పోరాడవలసిన అవసరాన్ని మరింత పెంచుతాయే గాని తగ్గించవు. ఎందుకంటే వీటి అంతిమ ఫలితం మోసేది శ్రమజీవులు, సామాన్య ప్రజానీకమే. అలాంటి ప్రత్యక్ష దాడులే మనం చూస్తున్నాం. ఆ ప్రజలు అందుకు వ్యతిరేకంగా ఒక్కతాటిపై నిలవకుండా మతపరమైన విభజనలు, విద్వేషాలు పెంచడం కూడా జరుగుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో మరింత ఐక్యంగా నిలబడి పొంచివున్న ప్రమాదాన్ని ప్రతిఘటించవలసి వుంటుంది. పాలక వర్గాలు స్వార్థ ప్రయోజనాల కోసం ఎంతకైనా దిగజారతాయనే వాస్తవిక అవగాహన లేకుండా ఏదో అవకాశవాదాలతో అంచనా వేసుకోవడం ఎక్కడకు దారితీస్తుంది? ఎ.పి, తెలంగాణల లోనే ఈ తరహా ఆలోచనల పర్యవసానాలు చూస్తూనే వున్నాం. బిజెపి నిరంకుశత్వాన్ని, మతతత్వ రాజకీయాలను నికరంగా ఎదుర్కొనే బదులు ఊగిసలాటలు, లోపాయికారీ పోకడలకు పాల్పడిన ప్రతివారూ మూల్యం చెల్లించక తప్పలేదు. అయినా టిడిపి, జనసేన దాంతో జత కట్టడానికి ఉబలాటపడ్డాయి. వైసిపి అప్రకటిత మైత్రీ బంధం పాటిస్తున్నది. అయినా సరే మోడీ సర్కారు రాష్ట్రానికి అన్యాయం చేస్తూనే వుంది. తెలంగాణలోనూ కాంగ్రెస్, బిఆర్‌ఎస్‌ల మధ్య కపట నాటకం నడిపిస్తూ తన పబ్బం గడుపుకొంటున్నది. ఈ పరిణామాల పట్ల స్పష్టమైన, కచ్చితమైన వైఖరి తీసుకోకపోతే ఆ యా పార్టీలూ రాష్ట్రాలూ కూడా నష్టపోవడం అనివార్యమవుతుంది. కాంగ్రెస్ నాయకత్వమే ఆ మెళకువతో అన్ని చోట్ల సరైన వైఖరి తీసుకోలేకపోతున్న తీరును కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ సూటిగా విమర్శించారు.

400 సీట్ల పాట, నిరంకుశత్వ బాట

ఇదంతా ఒక ఎత్తయితే అసలు మోడీ మరింత ఆధిక్యతతో అధికారానికి రావడం తథ్యమనే ప్రచారానికి ఆధారమేమిటి? టైమ్స్ నౌ, న్యూస్ 18, ఇండియా టీవీ, ఇండియా టుడే ఇలా ఏవేవో సర్వేలు ఇందుకు ఆధారంగా చూపిస్తుంటారు. జాతీయ మీడియా దాంతో చేతులు కలిపే సర్వే సంస్థలూ ఇంతకన్నా భిన్నమైన అంచనాలు ఎలా ఇస్తాయి? సర్వేలు చాలాసార్లు విఫలం కావడం చూశాం. ఒక మేరకు నిజమైనా అంచనాలకు చాలా దూరంలో నిలబడిన పరిస్థితీ చూశాం. యు.పి లో బిజెపి బ్రహ్మాండంగా వచ్చేస్తుందనీ, హిందీ రాష్ట్రాలలోనూ గుజరాత్‌లోనూ బలం పెంచుకుంటుందని చెప్పే అంచనాలపై ఆధారపడి ఈ జోస్యాలు చెబుతున్నారు. నిజానికి యు.పిలో కూడా ఎస్.పి, కాంగ్రెస్ గతంకన్నా మెరుగైన ఫలితాలు సాధించే అవకాశం వుంది. బీహార్‌లో నితీశ్ కుమార్ కన్నా ఆర్‌జెడి నాయకత్వంలోని 'ఇండియా'కే మెరుగైన అవకాశాలున్నాయి. మధ్యప్రదేశ్, రాజస్థాన్, చత్తీస్‌గఢ్‌లలో మొన్నటి ఎన్నికలలో బిజెపి విజయం సాధించినా కాంగ్రెస్ దీటుగానే ఓటు తెచ్చుకున్నది. బెంగాల్‌లో తృణమూల్, ఒరిస్సాలో బిజెడి ఎక్కువ స్థానాలు తెచ్చుకుంటాయనే సర్వేల సారాంశంగా వుంది. కేరళ తమిళనాడు, ఎ.పిలలో బిజెపి నామమాత్రం. ఎ.పిలో బిజెపితో కలవడం వల్ల టిడిపికి కూడా నష్టమనే అంచనాలూ అనేకం. తమిళనాడులో డిఎంకె కూటమి దాదాపు తుడిచి పెడితే కేరళలో యుడిఎఫ్, ఎల్‌డిఎఫ్ మధ్యనే సీట్ల విభజన వుంటుంది. మహారాష్ట్రలో పోటాపోటీగానే నడవొచ్చు. ప్రధాన రాష్ట్రాలలో పరిస్థితి ఇలా వుంటే బిజెపికి ఏదో అపూర్వమైన ఆధిక్యత వస్తుందని ఎలా చెబుతున్నారు? ఈ మధ్య కాలంలో మత రాజకీయాల నుంచి ఎలక్టోరల్ బాండ్ల వరకూ ఎన్ని విషయాల్లో మోడీ ప్రభుత్వం నిరసనను ఎదుర్కొంది? నిరుద్యోగం, ధరల పెరుగుదల, రాష్ట్రాల అప్పుల భారం వంటి అంశాలు ఆందోళన కలిగించడం లేదా? ఆ ప్రభావం ఓటర్లపై వుండదా?

బిజెపికి నిజంగా తిరుగు లేదనేట్టయితే ప్రతి సందర్భంలోనూ ఏకపక్షంగా చర్యలు తీసుకోవలసిన అవసరమేమొచ్చింది? ఈ అయిదేళ్ల కిందట నడిచిన రైతాంగ ఆందోళనను అణచి వేశామనుకుంటే మళ్లీ మొదలవలేదా? అప్పటి పౌరసత్వ సవరణ చట్టంపై ఆందోళన కూడా కొత్త రూపంలో మొదలవలేదా? మీడియా నోరు నొక్కేందుకు ప్రతిపక్షాల ఖాతాలనూ కార్యకలాపాలనూ అడ్డుకునేందుకు రకరకాల అప్రజాస్వామిక చర్యలకు పాల్పడాల్సిన అవసరమేమొచ్చింది? అరవింద్ కేజ్రీవాల్, హేమంత్ సోరెన్ వంటి ముఖ్యమంత్రుల అరెస్టు ఏం చెబుతుంది? నిజమైన సమస్యలను పక్కదోవ పట్టించడానికి కాకపోతే కచ్చతీవు వంటి పాత అంశాలను తిరగదోడడం, చైనాతో వివాదాలను పదేపదే పైకి తేవడం, పాకిస్తాన్‌పై ఏదో చేస్తున్నట్టు బిల్డప్‌లు ఇవన్నీ ఎందుకు? ఇంత చేసినా బిజెపిలోనూ సంఘ పరివార్‌లోనూ అంతర్గతంగా విభేదాలు రావడం, ఉన్నతాధికారులే విభేదాలు వెల్లడించడం నిజమే కదా? దగ్గరకు వచ్చిన బిజెడి, అకాలీ వంటి వారు కూడా మళ్లీ వెనక్కు పోలేదా? పొత్తు పెట్టుకున్న టిడిపి అనుకూలంగా వుండే వైసిపి కూడా తాము మైనార్టీలకు వ్యతిరేకం కాదని చూపుకోవడానికి ఎన్ని తంటాలు పడుతున్నాయి? దేశంలో పరిస్థితి అలా వుంచి అమెరికా జర్మనీ, ఐక్యరాజ్యసమితి కూడా అప్రజాస్వామిక ధోరణులపై ఆందోళన, అభ్యంతరాలు వెలిబుచ్చలేదా? వాటి జోక్యం సరైందా అనే ప్రశ్న ఒకటైతే మోడీ సర్కారు చర్యల పట్ల స్పందనలు ఎలా వున్నాయనేది దీన్నిబట్టి విదితమవుతుంది. ఇవి మన ప్రజలు గమనించలే రనీ, స్పందించరనీ అనుకోవడం పొరబాటు. గతంలో చాలాసార్లు చైతన్యవంతమైన తీర్పులతో చారిత్రక మార్పులు తెచ్చిన భారతీయ ఓటర్లు ఇప్పుడు కూడా ఆ మెళకువ చూపించకపోరు. అది ఏ రాష్ట్రంలో ఏ రూపంలో ఏ స్థాయిలో వుంటుందనేది వాస్తవంలో చూడాలి. గతంలో ప్రత్యామ్నాయాలు వచ్చినపుడు ఇన్ని ప్రతిపక్ష ప్రభుత్వాలు, ఇన్ని ప్రాంతీయ పార్టీలూ వుండేవి కావు. కాకపోతే ఇప్పుడు ప్రాంతీయ పార్టీల స్వభావంలో మార్పు వచ్చిన మాట నిజమే గానీ బిజెపితో కలసినవి తక్కువే. ఎన్నికల ఫలితాల తర్వాత మాత్రమే ప్రభుత్వ ఏర్పాటు గురించిన చర్చకు అర్థం వుంటుంది. అప్పుడు ఎవరు ఏమి చేస్తారనేది కీలకం. ఈ లోగా ఎన్నికల సవాళ్లను దీటుగా ఎదుర్కొనవలసి వుంటుంది.



బిజెపికి నిజంగా తిరుగు లేదనేట్టయితే ప్రతి సందర్భంలోనూ ఏకపక్షంగా చర్యలు తీసుకోవలసిన అవసరమేమొచ్చింది? ఈ అయిదేళ్ల కిందట నడిచిన రైతాంగ ఆందోళనను అణచి వేశామనుకుంటే మళ్లీ మొదలవలేదా? అప్పటి పౌరసత్వ సవరణ చట్టంపై ఆందోళన కూడా కొత్త రూపంలో మొదలవలేదా? మీడియా నోరు నొక్కేందుకు ప్రతిపక్షాల ఖాతాలనూ కార్యకలాపాలనూ అడ్డుకునేందుకు రకరకాల అప్రజాస్వామిక చర్యలకు పాల్పడాల్సిన అవసరమేమొచ్చింది? అరవింద్ కేజ్రీవాల్, హేమంత్ సోరెన్ వంటి ముఖ్యమంత్రుల అరెస్టు ఏం చెబుతుంది? నిజమైన సమస్యలను పక్కదోవ పట్టించడానికి కాకపోతే కచ్చతీవు వంటి పాత అంశాలను తిరగదోడడం, చైనాతో వివాదాలను పదేపదే పైకి తేవడం, పాకిస్తాన్‌పై ఏదో చేస్తున్నట్టు బిల్డప్‌లు ఇవన్నీ ఎందుకు?

గతంలో చాలాసార్లు చైతన్యవంతమైన తీర్పులతో చారిత్రక మార్పులు తెచ్చిన భారతీయ ఓటర్లు ఇప్పుడు కూడా ఆ మెళకువ చూపించకపోరు. అది ఏ రాష్ట్రంలో ఏ రూపంలో ఏ స్థాయిలో వుంటుందనేది వాస్తవంలో చూడాలి. గతంలో ప్రత్యామ్నాయాలు వచ్చినపుడు ఇన్ని ప్రతిపక్ష ప్రభుత్వాలు, ఇన్ని ప్రాంతీయ పార్టీలూ వుండేవి కావు. కాకపోతే ఇప్పుడు ప్రాంతీయ పార్టీల స్వభావంలో మార్పు వచ్చిన మాట నిజమే గానీ బిజెపితో కలసినవి తక్కువే. ఎన్నికల ఫలితాల తర్వాత మాత్రమే ప్రభుత్వ ఏర్పాటు గురించిన చర్చకు అర్థం వుంటుంది. అప్పుడు ఎవరు ఏమి చేస్తారనేది కీలకం. ఈ లోగా ఎన్నికల సవాళ్లను దీటుగా ఎదుర్కొనవలసి వుంటుంది.

పిఎంఎల్‌ఎను రద్దు చేయాలి, ఇ.డి కోరలు పీకాలి

వ్యాఖ్య

లోక్‌సభ ఎన్నికల కోసం సిపిఎం విడుదల చేసిన ఎన్నికల ప్రణాళిక...భారత ప్రజాస్వామ్యం, పౌరుల ప్రాథమిక హక్కులపై కీలకమైన ప్రభావాన్ని చూపించగల ముఖ్యమైన అంశాన్ని లేవనెత్తింది. ఇది ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇ.డి)–మనీ లాండరింగ్ నిరోధక చట్టం (పి.ఎం.ఎల్.ఎ) పరిధిలో ఆ సంస్థ ఎలా పని చేస్తుందన్నదానికి సంబంధించినది.

"చట్ట దుర్వినియోగాన్ని నిరోధించేందుకుగాను పిఎంఎల్‌ఎ స్థానంలో సముచితమైన మరో చట్టాన్ని తీసుకురావాలి. ఇ.డి నుంచి చట్ట అమలు అధికారాలను కచ్చితంగా తొలగించాల్సిందే." అని సిపిఎం ఎన్నికల ప్రణాళికలో నొక్కి చెప్పింది.

ప్రజాస్వామ్యాన్ని, ప్రతిపక్షాల హక్కులను పరిరక్షించాలంటే సకాలంలో తీసుకోవాల్సిన ఆవశ్యకమైన ప్రిస్క్రిప్షన్ ఇది. డజన్ల సంఖ్యలో ప్రతిపక్షాల నేతలను లక్ష్యంగా చేసుకోవడానికి పిఎంఎల్‌ఎను ఇ.డి ఎలా ఆయుధంగా వాడుకుంటున్నదో మనం చూస్తున్నాం. ఎన్నికల నేపథ్యంలో, ముఖ్యమంత్రులు హేమంత్ సోరెన్, అరవింద్ కేజ్రీవాల్‌లను పిఎంఎల్‌ఎ నిబంధనలను ప్రయోగించి అది ఎలా అరెస్టు చేసిందీ చూశాం.

ఒక చట్టంగా పిఎంఎల్‌ఎ అసలు లక్ష్యం నుంచి పూర్తిగా పక్కకు మళ్లి కొత్త రూపు తీసుకుంది. డ్రగ్ మనీ లాండరింగ్‌ను సమర్థవంతంగా అరికట్టేందుకు తగు చట్టాలు తీసుకురావాలని సభ్యదేశాలను కోరుతూ ఐరాస జనరల్ అసెంబ్లీ 1998లో చేసిన తీర్మానానికి అనుగుణంగా 2005లో మొదటిసారి పిఎంఎల్‌ఎ చట్టాన్ని తీసుకొచ్చారు.

అయితే, గత కొన్నేళ్లగా పలు సవరణల ద్వారా పిఎంఎల్‌ఎ పరిధిని అంతకంతకూ విస్తరిస్తూ వచ్చారు. 2013లో యుపిఎ ప్రభుత్వం కొన్ని సవరణలు చేసింది. అత్యంత దుర్మార్గమైన నిబంధనలన్నీ 2018లో బిజెపి ప్రభుత్వం ప్రవేశపెట్టింది. డ్రగ్ మనీ లాండరింగ్‌ను అరికట్టేందుకు ఉద్దేశించిన ఈ చట్టానికి వరుసగా చేపట్టిన సవరణల ద్వారా భారత శిక్షా స్మృతి (ఐపిసి) ఇతర చట్టాలకు సంబంధించిన అనేక నేరాలను దీని పరిధి కిందికి తీసుకొచ్చారు. ఇవన్నీ పిఎంఎల్‌ఎలో భాగమయ్యాయి. ఇటువంటి చర్యల ద్వారా డ్రగ్ మనీ లేదా మనీ లాండరింగ్‌తో ఏ మాత్రం సంబంధం లేని పలు నేరాల దర్యాప్తుకు అవసరమైన అపారమైన అధికారాలను ఇ.డి సమకూర్చుకుంది.

పిఎంఎల్‌ఎ లోని అత్యంత అభ్యంతకరకమైన అంశమేమంటే బెయిల్ నిబంధన. ఒక వ్యక్తి దోషి అని రుజువయ్యేంతవరకు ఆ వ్యక్తిని నిర్దోషిగానే భావించాల్సి వుంటుందన్నది క్రిమినల్ లా లోని ప్రాథమిక సూత్రం. కానీ, చట్టంలోని 45వ సెక్షన్ ప్రకారం నిందితుడు నిర్దోషి అని న్యాయమూర్తి సంతృప్తి చెందినప్పుడు మాత్రమే బెయిల్ ఇవ్వాలి. అందువల్ల, తాను నిర్దోషినని రుజువు చేసుకోవాల్సిన బాధ్యత నిందితుడిపైనే వుంటుంది. దురదృష్టవశాత్తూ, జస్టిస్ ఖాన్‌విల్కర్ నేతృత్వంలోని సుప్రీం త్రిసభ్య ధర్మాసనం ఈ చట్టాన్ని మరింత క్రూరంగా మార్చే ఈ సవరణలన్నింటినీ సమర్థించింది.

ప్రభుత్వ ఉద్యోగుల లంచం లేదా ఇతర అవకతవకలకు సంబంధించిన నేరాలను అరికట్టించే అవినీతి నిరోధక చట్టం వుంది. ఈ చట్టం కింద నేరాలను కూడా పిఎంఎల్‌ఎ షెడ్యూల్‌లోకి తీసుకొచ్చారు. ఆ తర్వాత ప్రజా ప్రతినిధులుగా ఎన్నికైన రాజకీయ నేతలు, మంత్రులను ఈ నిరంకుశ చట్ట నిబంధనలను ఉపయోగించి అరెస్టు చేయడానికి ఇ.డి కి ఇది వీలు కల్పించింది. సాధారణంగా అవినీతి నిరోధక చట్టం కింద కేసుల దర్యాప్తును సిబిఐ చేపట్టాలి, కానీ ఇప్పుడు వాటిని ఇ.డి చేపడుతోంది. నేరపూరిత కుట్ర, హత్యా యత్నం, బలవంతపు వసూళ్ళు, కిడ్నాపింగ్ ఇలా ఇండియన్ పీనల్ కోడ్ కిందకు వచ్చే పలు నేరాల దర్యాప్తులో ఇ.డి జోక్యం చేసుకోగలుగుతోంది. సమాచార సాంకేతిక చట్టం, ఇతర చట్టాల పరిధిలోకి వచ్చే నేరాలపై కూడా ఇదే చర్యలు తీసుకోగలుగుతోంది.

ఇ.డి అనేది మొదట్లో ఆర్థిక మంత్రిత్వ శాఖలో రెవిన్యూ విభాగం కింద పని చేసేది. సిబిఐకి ఢిల్లీ పోలీసు చట్టం వున్నట్టుగా దీనికి ఎలాంటి నియమావళి లేదు. దీంతో ఇది ప్రభుత్వం చేతిలోని ఓ అరాచక సంస్థగా మారింది. ఇందుకు పిఎంఎల్‌ఎకు ప్రభుత్వం కృతజ్ఞతలు చెప్పుకోవాలి. సిబిఐని పోలీసు అధికారులు నడుపుతారు. ఇ.డి అలా కాదు. దీనిలోని అధికారులందరూ ఇండియన్ రెవిన్యూ సర్వీస్‌లో లేదా ఇతర సివిల్ సర్వీసెస్‌లో పనిచేసేవారే. అందువల్ల పోలీసు అధికారులు తమ విధి నిర్వహణలో ఎదురయ్యే ఇబ్బందులు ఇ.డి అధికారులకు వుండవు. ఉదాహరణకు ఇ.డి అధికారి రికార్డు చేసిన నిందితుడి స్టేట్‌మెంట్‌ను కోర్టులో ప్రవేశపెట్టవచ్చు. అదే పోలీసు అధికారి అయితే ఆ పని చేయలేరు. ఆ అధికారి ఐపిసి నిబంధనల మేరకు పనిచేయాల్సి వుంటుంది. వాస్తవానికి, సుప్రీం కోర్టు కూడా తన తీర్పులో దీన్ని సమర్థించింది. వారు పోలీసు అధికారులు కారంటూ ఇ.డి అధికారులకు గల ఈ అధికారాన్ని కోర్టు సమర్థించింది.

ఇ.డి పాత్ర విషయానికొస్తే పాలక పార్టీ రాజకీయ ప్రత్యర్థులను లక్ష్యంగా చేసుకోవడం, వారిని వెంటాడడానికి మాత్రమే అది పరిమితం కాలేదు. ఇటీవల ఎన్నికల బాండ్ల పథకానికి సంబంధించి వెల్లడైన కొన్ని విషయాలను పరిశీలిస్తే దీంట్లోని చీకటి కోణం బట్టబయలైంది. ఎన్నికల బాండ్ల ద్వారా బిజెపికి నిధులను సమకూర్చేందుకు వ్యాపారవేత్తలను, కంపెనీలను బెదిరించడానికి, వారిని వేధించడానికి ఇ.డిని ఉపయోగించుకుంది. ఒక ప్రభుత్వ సంస్థను ఇలా బ్లాక్‌మెయిల్‌కు, బలవంతపు వసూళ్ళకు, దోపిడీకి దారుణంగా ఉపయోగించినందున ఇందుకు పాల్పడిన వారిని క్రిమినల్ నేరాల కింద ప్రాసిక్యూట్ చేయాలి.

అందువల్ల, ఎన్నికల ప్రణాళికలో సిపిఎం చేసిన ప్రతిపాదన అత్యంత సహేతుకంగాను, సముచితంగా వుంది. మొదటగా, పిఎంఎల్‌ఎను రద్దు చేయాల్సిందే. తర్వాత కొత్త చట్టాన్ని రూపొందించాలి. ఇది అంతర్జాతీయ మాఫియా ముఠాలతో పెనవేసుకుపోయిన డ్రగ్ మనీ లాండరింగ్, మనీ లాండరింగ్‌ను కఠినంగా అణచివేసేలా కొత్త చట్టాన్ని తీసుకురావాలి.

ఇక రెండోది, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కోరలు పీకివేయాలి. దర్యాప్తు చేసే, చట్టాన్ని అమలు చేసే అధికారాలు కలిగిన సంస్థగానే దీన్ని వుంచాలి. రెవిన్యూ శాఖకు సంబంధించిన ఒక విభాగంగా మాత్రమే ఇది పనిచేయాలి. మాదకద్రవ్యాల అక్రమార్జన, అంతర్జాతీయ మనీ లాండరింగ్‌ను ట్రాక్ చేయడమనేది రెవిన్యూ శాఖ కర్తవ్యంగా వుండాలి. తాను సేకరించిన ఇంటెలిజెన్స్, సమాచారాన్ని సిబిఐ వంటి సంబంధిత లా ఎన్‌ఫోర్స్‌మెంట్ సంస్థలకు చర్యలు తీసుకునే నిమిత్తం అందచేయాలి.

దేశంలో ప్రజాస్వామ్యాన్ని, ప్రజాస్వామ్య హక్కులను పునరుద్ధరించాలంటే ఈ రెండు కర్తవ్యాలు చేపట్టడం తప్పనిసరి.

/ ఏప్రిల్3 'పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం /

PEOPLE'S DEMOCRACY



కవిత్వం



క్రోధి..

ఇది మాత్రం రాజకీయ
ఉగాది
వస్తూనే తెచ్చింది
ఎన్నికల వసంతపు వేడి
కూడలిలో గొంతు విప్పెను
పలు కూతల నేత కోయిలలు
పూటకో మారు మారేను
నూతన వస్త్రాల రంగులు
అసభ్యకర బురద జల్లుల్లో
అభ్యంగన స్నానాలు
గ్యారంటీల, వారంటీల
మానిఫెస్టో పంచాంగాలు
ఆలయ సందర్శనాల మించు
అరచేతి లో వైకుంఠ దర్శనాలు
ప్రచారంలో పడి వెనికి రాని పచ్చి
నిజాలు
నింబ కుసుమాల కన్నా చేదు
గుళికలు
రాజకీయ ఉగాదీ!
ఇందు ప్రజా కాంక్ష కు చోటేదీ?
అసలు ప్రజాస్వామ్యపు జాడేదీ?

- డా.డి.వి.జి. శంకరరావు,
మాజీ ఎంపీ, విజయనగరం.

గవర్నర్ల వ్యవస్థ రద్దు చేస్తాం

- పట్టణాల్లోనూ ఉపాధి పథకం తీసుకొస్తాం
- ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు అమల్జేస్తాం
- సిపిఐ ఎన్నికల ప్రణాళికలో హామీ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ప్రజాస్వామ్య విలువలను మంటగలిపి, సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీస్తున్న గవర్నర్ల వ్యవస్థను రద్దు చేస్తామని, ప్రయివేటు రంగంలో రిజర్వేషన్లు అమలు చేస్తామని, గ్రామీణ భారతావనిలో అమలవుతున్న ఉపాధి హామీ పథకం తరహాలో పట్టణాల్లోనూ ఉపాధి కల్పించేందుకు చట్టం తీసుకొస్తామని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) తన ఎన్నికల ప్రణాళికలో హామీ ఇచ్చింది. సిపిఐ కేంద్ర కార్యాలయం అజయ్ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో పార్టీ ప్రధానకార్యదర్శి డి రాజా.. నాయకులు బికె కాంగో, సయ్యద్ అజీజ్ పాషా, దినేష్ వర్ష్ణీతో కలిసి సార్వత్రిక ఎన్నికల కోసం మేనిఫెస్టో విడుదల చేశారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి), సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సిబిఐ) వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలను పార్లమెంటు పరిధిలోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొంది. సమాఖ్య వ్యవస్థను బలోపేతం చేయడానికి గవర్నర్ వ్యవస్థ రద్దు చేయడం కోసం తమ పోరాటాన్ని ఉధృతం చేస్తామని, కేంద్రం జోక్యాన్ని తొలగించడానికి ప్రయత్నిస్తామని తెలిపింది. 'రాష్ట్రాలలో ఎన్నికైన ప్రభుత్వాలకు ప్రధాన విధాన నిర్ణయాలు తీసుకునే అధికారం కల్పిస్తామని మేనిఫెస్టోలో సిపిఐ హామీ ఇచ్చింది.

మార్పు కోసం ఓటు : డి.రాజా

మేనిఫెస్టో విడుదల సందర్భంగా డి రాజా మాట్లాడుతూ.. ఈ ఎన్నికలు దేశానికి, భవిష్యత్తుకు చాలా కీలకమైనవి, ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలోని బిజెపి పాలన దేశానికి వినాశకరమైనదని ఆయన అన్నారు. బిజెపిని గద్దె దించేందుకు ప్రజలు మార్పు కోసం ఓటు వేయాలని కోరారు. ఆర్‌ఎస్‌ఎస్ రాజకీయ సైన్యంగా పనిచేస్తున్న బిజెపి భారత రాజ్యాంగాన్ని మార్చేసేందుకు కుట్ర పన్నుతోందని విమర్శించారు. మోడీ పాలనలో దేశ ప్రజల బతుకులు కష్టతరంగా మారాయన్నారు. దేశ సంపదను అతి సంపన్నులకు కట్టబెట్టి పేదలను మరింత పేదరికంలో బిజెపి నెట్టివేస్తోందని తప్పుబట్టారు. రాజ్యాంగ, లౌకిక, ప్రజాస్వామ్యం, సమాఖ్య విలువలను మంటగలుపుతున్న ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి ఎత్తుగడులను ఓడించేందుకు ప్రజలంతా ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటయ్యాక ప్రజల సమస్యలను లేవనెత్తేందుకు తమ పార్టీ తనవంతు పాత్ర పోషిస్తుందని రాజా తెలిపారు.


మేనిఫెస్టో విడుదల చేస్తున్న సిపిఐ ప్రధానకార్యదర్శి డి రాజా, వేదికపై నాయకులు డాక్టర్ బికె కాంగో, అజీజ్ పాషా, ప్రొఫెసర్ దినేశ్ వర్ష్ణీ

మేనిఫెస్టోలో ప్రధానాంశాలు

పౌరసత్వ సవరణ చట్టం, యుఎపిఎ రద్దు కోసం పోరాటం కొనసాగిస్తామని, ఎన్నికల కమిషనర్ల నియామకం పారదర్శకంగా నిర్వహించేందుకు కృషి చేస్తామని, సాధారణ జనాభా గణనతోపాటు కుల గణనను చేపట్టేందుకు కృషి చేస్తామని సిపిఐ హామీ ఇచ్చింది. పట్టణ ఉపాధి హామీ పథకం కోసం పాలక పార్టీలపై ఒత్తిడి పెంచుతామని తెలిపింది. సైన్యంలో కాంట్రాక్టీకరణ కోసం ప్రవేశపెట్టిన అగ్నిపథ్ రద్దు పథకాన్ని చేసేలా ఒత్తిడి తీసుకొస్తామని పేర్కొంది. గిగ్-వర్కర్లకు సామాజిక భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చింది. ఎస్సి, ఎస్టి, బిసిల 50 శాతం రిజర్వేషన్ల పరిమితిని తొలగిస్తామని, ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లను తీసుకొస్తామని పేర్కొంది. కార్పొరేట్ పన్ను పెంచుతామని, గ్రామీణ ఉపాధి హామీ పథకంలో 200 పని దినాలు కల్పించి, కనీస వేతనం రూ.700 ఉండేలా కృషి చేస్తామని తెలిపింది. కేంద్ర ప్రభుత్వ పాఠ్యపుస్తకాల్లో చొప్పించిన అన్ని అశాస్త్రీయ భాగాలను తొలగిస్తామని పేర్కొంది.

చిన్నారులకు కాల్చిన కడ్డీలతో శంఖు ముద్రలు

- టెక్సాస్‌లో అష్టలక్ష్మీ ఆలయ నిర్వాహకులపై దావా

హ్యూస్టన్ : అమెరికాలోని టెక్సాస్‌లో జీయర్ ట్రస్టు నిర్వహిస్తున్న అష్టలక్ష్మీ ఆలయంలో రెండేళ్ల కిందట దారుణం చోటుచేసుకుంది. అప్పట్లో అక్కడ నిర్వహించిన అధ్యాత్మిక కార్యక్రమానికి వెళ్లిన బాలుర భుజాలపై ఇనుప చువ్వలను కాల్చి శంఖు చక్రాల ముద్రలు వేశారు. ఇలా ముద్రలు వేయించుకున్న చిన్నారుల్లో 11 ఏళ్ల బాలుడు కూడా ఉన్నారు. ఇప్పుడు ఆ బాలుడి తండ్రి విజయ్ చెరువు.. ఆలయం నుంచి, ఆలయ నిర్వహణ సంస్థ జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ (అమెరికా) నుంచి రూ.7.5 కోట్ల మేర నష్టపరిహారం కోరుతూ ఇటీవల దావా వేశారు. తమ కుమారుడిని తన మాజీ భార్య గుడికి తీసుకెళ్లి ముద్ర వేయించడంతో అతడు ఎంతో బాధకు గురయ్యాడని కోర్టుకు తెలిపారు. దీనికి తండ్రి అనుమతి లేదని, టెక్సాస్‌లో తల్లిదండ్రుల అనుమతి ఉన్నా లేకున్నా బాలలకు పచ్చబొట్లు పొడవడం, కర్రుపెట్టి ముద్ర వేయడం చట్టవిరుద్ధమని విజయ్ న్యాయవాది బ్రాంట్ స్టోగ్నర్ పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై ఆలయ నిర్వాహకులు స్పందించాల్సివుంది.


డెలాపోర్టే - శ్రీనివాస్ పల్లియా

విప్రో సిఇఒ డెలాపోర్టే రాజీనామా

- ఆయన స్థానంలో శ్రీనివాస్‌కు బాధ్యతలు

న్యూఢిల్లీ : సమాచార, సాంకేతిక దిగ్గజ సంస్థ విప్రోలో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. ఆ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్, సిఇఒ థియరీ డెలాపోర్టే తన పదవులకు రాజీనామా చేశారు. ఆయన స్థానంలో శ్రీనివాస్ పల్లియాను నియమించినట్లు విప్రో తెలిపింది. తక్షణమే ఈ నియామకం అమల్లోకి వస్తుందని పేర్కొంది. ఈ మేరకు బిఎస్‌ఇకి సమాచారం ఇచ్చింది. ఏప్రిల్ 6 నుంచి డెలాపోర్టే రాజీనామా అమల్లోకి వస్తుందని విప్రో బోర్డు ప్రకటించింది. వ్యక్తిగత కారణాలతో డెలాపోర్టే వైదొలిగారని, ఈ ఏడాది మే 31 నుంచి కంపెనీలోని ఉద్యోగ బాధ్యతల నుంచి పూర్తిగా తప్పుకొంటారని తెలిపింది. ఏప్రిల్ 7 నుంచి శ్రీనివాస్ పల్లియా నియామకం అమల్లోకి రానుందని, ఐదేళ్ల కాలానికి ఈ పదవిలో ఆయన కొనసాగుతారని కంపెనీ పేర్కొంది. డెలాపోర్టే అంతకుముందు క్యాప్‌జెమినీ గ్రూప్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్‌గా ఉన్నారు. 2020లో విప్రో సిఇఒగా నియమితులయ్యారు. నాలుగేళ్లుగా సిఇఒగా, ఎండీగా విప్రోలో పని చేశారు. కొత్తగా నియమితులైన శ్రీనివాస్ పల్లియా మూడు దశాబ్దాలుగా విప్రోలో పనిచేస్తున్నారు. విప్రో కన్స్యూమర్ బిజినెస్ యూనిట్ ప్రెసిడెంట్‌గా పని చేసిన ఆయన ప్రస్తుతం అమెరికాస్ 1 సిఇఒగానూ వ్యవహరిస్తున్నారు.


రాజస్థాన్‌లోని జైపూర్‌లో జరిగిన ప్రచార సభలో మేనిఫెస్టో ఆవిష్కరిస్తున్న సోనియా, ఖర్గే, ప్రియాంక తదితరులు

దేశ గౌరవాన్ని, ప్రజాస్వామ్యాన్ని
తుంగలో తొక్కుతున్నారు !

జైపూర్ సభలో సోనియా విమర్శ

జైపూర్ : దేశ గౌరవాన్ని, ప్రజాస్వామ్యాన్ని ప్రధాని నరేంద్ర మోడీ తుంగలో తొక్కుతున్నారని కాంగ్రెస్ సీనియర్ నాయకులు సోనియా గాంధీ విమర్శించారు. ప్రతిపక్ష నేతలు బిజెపిలో చేరేలా అనేక రకాల ఎత్తుగడలకు పాల్పడతున్నారని విమర్శించారు. జైపూర్‌లో శనివారం జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఆమె ప్రసంగించారు. బిజెపి ఏలుబడిలో గత పదేళ్ళుగా దేశంలో నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, ఆర్థిక సంక్షోభం, అసమానతలు అంతకంతకూ పెరిగిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. నేడు మన దేశ ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలన్నీ నాశనమవుతున్నాయని, భారత రాజ్యాంగాన్ని మార్చేందుకు కుట్ర జరుగుతోందని సోనియా విమర్శించారు. మోడీ సర్కార్ నిరంకుశవాద ప్రభుత్వమని, మనందరం కలిసి దీనికి సరైన గుణపాఠం చెప్పాలని ప్రజలను కోరారు. తనకు తాను గొప్పవాడినని చెప్పుకునే మోడీ ఈ దేశ పేరు ప్రతిష్టలను దిగజారుస్తున్నారని విమర్శించారు.

అంతకుముందు సభలో పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ వద్రా మాట్లాడుతూ, బిజెపి పాలనలో ప్రతిపక్షాలు తీవ్ర దాడులకు గురవుతున్నారని విమర్శించారు. నిరుద్యోగం, ద్రవ్యోల్బణం పెచ్చరిల్లుతున్నాయని, పేదల, రైతుల గోడు పట్టించుకునే వాడు లేడని అన్నారు. న్యాయం కావాలని కోరుతున్న దేశ ప్రజల వాణిని వినిపించేలా తమ ఎన్నికల ప్రణాళిక విడుదల చేశామని, అంతేకానీ ఎన్నికల్లో గెలిచి అధికారంలోకి రాగానే మర్చిపోయే హామీల ప్రకటనలు కాదని అన్నారు.

ద్వంద్వ పౌరసత్వానికి ద్వారాలు తెరుస్తున్న సిఎఎ నిబంధనలు

- సుప్రీంలో సిఎఎ వ్యతిరేక పిటిషన్‌దారుల ఆందోళన

న్యూఢిల్లీ : భారతదేశ పౌరసత్వం కావాలని కోరుతున్న విదేశీయులు తమ స్వదేశ పౌరసత్వాన్ని విడనాడాల్సిన అవసరం లేదని పౌరసత్వ సవరణ చట్టం (సిఎఎ) నిబంధనలు పేర్కొంటున్నందున ఈ నిబంధనలు ద్వంద్వ పౌరసత్వానికి ద్వారాలు తెరుస్తున్నాయని సిఎఎ వ్యతిరేక పిటిషన్‌దారులు సుప్రీంకోర్టులో ఆందోళన వ్యక్తం చేశారు. సిఎఎ నిబంధనలపై స్టే విధించాలని కోరుతూ వేసిన తమ పిటిషన్‌పై ఏప్రిల్ 9న విచారణ జరగనున్న నేపథ్యంలో పిటిషన్‌దారులు రాతపూర్వకంగా తమ వాదనలు దాఖలు చేశారు. పౌరతస్వ చట్టం-1955లోని సెక్షన్ 9, రాజ్యాంగంలోని 9వ అధికరణ రెండూ కూడా ద్వంద్వ పౌరసత్వాన్ని స్పష్టంగా నిషేధిస్తున్నాయి. మరో దేశ జాతీయులకు భారత పౌరసత్వాన్ని మంజూరు చేసేటపుడు వారు ముందుగా ఆ దేశ పౌరసత్వాన్ని త్యజించాల్సిన వాస్తవాన్ని సిఎఎ నిబంధనలు విస్మరించాయని ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ నేతృత్వంలోని పిటిషనర్లు పేర్కొన్నారు. సిఎఎలో అంతర్లీనంగా మతపరమైన వేధింపులు కనిపిస్తున్నాయని వారు పేర్కొన్నారు. పొరుగుదేశాలపైన పాకిస్తాన్, బంగ్లాదేశ్, ఆఫ్ఘనిస్తాన్‌ల్లో మైనారిటీలు వేధింపులు ఎదుర్కొంటూ ఇక్కడకు వచ్చిన శరణార్థుల కోసం ఈ చట్టాన్ని తీసుకువచ్చినట్లు కేంద్రం పేర్కొంటోంది. కానీ ఇలా వచ్చిన శరణార్థుల్లో కూడా ఎంపిక చేసిన గ్రూపుల వారిని మాత్రమే సిఎఎ ప్రయోజనాలకు అర్హులుగా ప్రకటించారని వారుపేర్కొన్నారు. మినహాయించబడిన శరణార్థుల గ్రూపులు అక్రమ శరణార్థులుగానే కొనసాగాల్సి వుంటుందన్నారు. వారికి భారత పౌరసత్వం కోరే అవకాశం కూడా లేకుడా పోయిందన్నారు.

సిబిఐ విచారణపై కవిత సవాల్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో తీహార్ జైలులో ఉంటున్న తనపై కేంద్ర దర్యాప్తు సంస్థ (సిబిఐ) విచారణకు అనుమతించడాన్ని బిఆర్‌ఎస్ నేత కవిత సవాలు చేశారు. ఈ మేరకు ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టులో కవిత తరపున సీనియర్ న్యాయవాది నితీష్ రాణా శనివారం కౌంటర్ పిటిషన్ దాఖలు చేశారు. సిబిఐ విచారణకు సంబంధించి తమకు సమాచారం లేదని, సహజ న్యాయసూత్రాలకు విరుద్ధమైన ఉత్తర్వులపై తక్షణమే స్టేటస్ కో విధించాలని అభ్యర్థించారు. అయితే అందుకు రౌస్ అవెన్యూ కోర్టు ప్రత్యేక జడ్జి కావేరి భవేజా నిరాకరించారు. కౌంటర్ పిటిషన్ పై వాదనలు విన్న తర్వాతే ఏ ఉత్తర్వులైనా ఇస్తామని పేర్కొన్నారు. కవిత పిటిషన్‌పై కౌంటర్ దాఖలుకు సిబిఐ మూడు రోజులు వరకు సమయం కోరింది. తదుపరి విచారణను ఈనెల 10న చేపట్టనున్నారు.

లాలూకు వ్యతిరేకంగా అరెస్టు వారెంట్ జారీ

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికలకు ముందు బీహార్ మాజీ ముఖ్యమంత్రి లల్లూ ప్రసాద్ యాదవ్‌కు వ్యతిరేకంగా మధ్య ప్రదేశ్‌లోని గ్వాలియర్ ప్రత్యేక న్యాయస్థానం పర్మినెంట్ అరెస్టు వారెంట్ జారీ చేసింది. ఎంపీలు, ఎమ్మెల్యేల కేసులను విచారించేందుకు ఉద్దేశించిన ఈ ప్రత్యేక న్యాయ స్థానం 1995-97 ఆయుధాలు, మందుగుండు సామగ్రి అక్రమంగా కొనుగోలు కేసులో లల్లూ ప్రసాద్ యాదవ్‌తో సహా 23 మందిని నిందితులుగా పేర్కొంది. వీరందరిపైన చార్జిషీట్‌ను దాఖలు చేసిన పోలీసులు, లలూ ప్రసాద్ యాదవ్‌ను పరారైన నిందితుడిగా ప్రకటించారు. ఈ కేసులో విచారణకు ఆర్జెడి వ్యవస్థాపక నేత తరపున ఎవరూ కోర్టుకు హాజరు కాలేదని, ప్రత్యేక కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ అభిషేక్ మెహ్రోతా పిటిఐకి తెఇపారు. ఈ కేసు విచారించిన ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి మహేంద్ర సైని ఈ అరెస్టు వారెండట జారీ చేశారు.

గాజా పై ఇజ్రాయిల్ యుద్ధోన్మాదానికి ఆరు నెలలు

- వేలల్లో మరణాలు, అంచనాలకు అందని విధ్వంసం
- ఇజ్రాయిల్ దాడులపై సర్వత్రా ఆందోళన
- కాల్పుల విరమణపై కైరోలో నేడు చర్చలు

గాజా : అమెరికా అండదండలతో యుద్ధోన్మాదంతో ఊగిపోతూ గాజా, పరిసర ప్రాంతాలపై ఇజ్రాయిల్ చేపట్టిన అమానవీయ దాడులు మొదలై ఆరు నెలలు పూర్తయ్యింది. చిన్నారులు, మహిళలు సహా వేలాది మంది అమాయక పౌరులు, వారికి సహాయం చేసేందుకు వెళ్లిన కార్యకర్తలు, పాత్రికేయులు ప్రాణాలు కోల్పోయినా, తినేకి తిండి దొరక్క..తల దాచుకునే దిక్కులేక అవస్థలు పడుతున్నా ఇజ్రాయిల్ వైఖరిలో ఇసుమంతైనా మార్పు రావడం లేదు. గతేడాది అక్టోబరు 7న మొదలు పెట్టిన ఈ ఊచకోతలో హమాస్ నియంత్రణలోని ఆరోగ్య మంత్రిత్వ శాఖ గణాంకాల ప్రకారం 182 రోజుల్లో దాదాపు 33 వేల మంది పాలస్తీనియన్లు ప్రాణాలు కోల్పోయారు. అయితే లెక్కల్లోకి రాని మరణాల సంఖ్య చాలానే వుంటుందని భావిస్తున్నారు. శిధిలాల కింద సమాధి అయిపోయినవారి సంఖ్య కూడా వేలల్లోనే వుంటుందని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ యుద్ధంలో తల్లిదండ్రులను కోల్పోయి వేల సంఖ్యలో పిల్లలు అనాథలుగా మారిపోయారు. తినడానికి తిండి, నిలువ నీడ లేకుండా రోడ్డున పడ్డారు. ఇక విధ్వంసం, ఆస్తి నష్టం అంచనాలకు కూడా అందని రీతిలో వుంది.

కైరోలో చర్చలకు హమాస్ బృందం

కాల్పుల విరమణపై ఆదివారం కైరోలో జరగనున్న చర్చలకు తమ బృందాన్ని పంపిస్తున్నట్లు హమాస్ వర్గాలు శనివారం తెలిపాయి. శాశ్వతంగా కాల్పుల విరమణ జరగాలనేది తమ డిమాండ్లలో ప్రధానమైనదని హమాస్ తెలిపింది. గాజా నుండి ఇజ్రాయిల్ సైన్యం వైదొలగాలని, గాజా నుండి వెళ్ళిపోయిన పాలస్తీనియన్లనందరూ తిరిగి వారి స్వస్థలాలకు, ఇళ్ళకు తిరిగి రావాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ప్రజల స్వేచ్ఛా రాకపోకలు, ప్రజలకు ఆహారం, వసతి సదుపాయాలు, బందీల మార్పిడి ఒప్పందం తమ డిమాండ్లని స్పష్టం చేసింది. మార్చి 14న తమ వైఖరి ఏదైతే స్పష్టం చేశామో దానికే కట్టుబడి వున్నామని పేర్కొంది. గత 24 గంటల్లో 45 మంది పాలస్తీనియన్లను అదుపులోకి తీసుకున్నట్లు ఇజ్రాయిల్ బలగాలు తెలిపాయి. దీంతో ఇప్పటివరకు అరెస్టయిన పాలస్తీనియన్ల సంఖ్య 8,080కి చేరినట్లు పాలస్తీనా ఖైదీల సొసైటీ తెలిపింది.


ఇజ్రాయిల్ క్షిపణి దాడుల్లో ధ్వంసమైన గాజాలోని అల్ సిఫా ఆసుపత్రి శిథిలాల మధ్య విలపిస్తున్న మహిళ

నెతన్యాహుకు బైడెన్ ఫోన్‌కాల్

ప్రజలకు హాని కలగకుండా, మానవతా సాయానికి అడ్డంకులు లేకుండా, సహాయ సిబ్బంది భద్రతకు ప్రమాదం లేకుండా తీసుకునే చర్యలపైనే అమెరికా గాజా విధానం ఆధారపడి వుంటుందని అమెరికా అధ్యక్షుడు బైడెన్ పేర్కొన్నారు. ఈ మేరకు ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహుకు ఫోన్ చేశారు. వరల్డ్ సెంట్రల్ కిచెన్ బృందంపై దాడి నేపథ్యంలో గాజాకు తమ సాయాన్ని నిలిపివేసినట్లు ఎన్‌జిఒ ఓపెన్స్ ఆర్మ్స్ ప్రకటించింది. ఉత్తర గాజాలోని బీట్ హనూన్ నగరంలో ఇజ్రాయిల్ జరిపిన వైమానిక దాడిలో ఒక పేరా మెడికోతో సహా నలుగురు మరణించారు. ఇప్పటివరకు సాగిన ఈ యుద్ధంలో వెయ్యి మందికి పైగా పిల్లలు ఒక కాలునో లేదా రెండు కాళ్ళనో పోగొట్టుకున్నారని పాలస్తీనా రెడ్ క్రీసెంట్ సొసైటీ తెలిపింది. గాజాలో ప్రతి గంటకు నలుగురు పిల్లలు మరణిస్తున్నారని తెలిపింది.

కొన్ని కీలక పరిణామాలు..

- 'ఆపరేషన్ అల్-అక్సా స్ట్రామ్' పేరిట గతేడాది అక్టోబర్ 7వ తేదీ తెల్లవారుజామున మెరుపుదాడికి పాల్పడిన హమాస్ మిలిటెంట్లు.. వందలాది మంది చనిపోయారు. 250 మందికిపైగా బందీలుగా చేసుకుని, గాజాకు తీసుకెళ్లారు. ఈ పరిణామంతో ఉలిక్కిపడిన ఇజ్రాయెల్.. హమాస్ తీవ్రవాదులను హతమార్చే పేరుతో గాజాపై యుద్ధానికి తెరలేపింది. అయితే అమాయక పాలస్తీనయన్లను బలితీసుకుంటోంది.
- బందీల్లో ఇప్పటివరకు 109 మంది హమాస్ సురక్షితంగా విడుదలు చేసింది. ముగ్గురిని సైన్యం కాపాడింది. 12 మంది మతదేహాలు లభ్యమయ్యాయి. మరో ముగ్గురు ఇజ్రాయిల్ సొంత సైన్యం చేతిలోనే మతి చెందారు. మిగిలినవారిలోనూ 34 మంది చనిపోయి ఉండొచ్చని ఇజ్రాయెల్ భావిస్తోంది. అయితే వీరంతా కూడా ఇజ్రాయిల్ వైమానిక దాడుల్లోనే ప్రాణాలు కోల్పోయారని హమాస్ ప్రకటించింది.
- మరోవైపు తమవారిని విడిపించాల్సిందిగా ప్రధాని నెతన్యాహుపై బాధితుల కుటుంబీకులు, పౌరుల నుంచి ఒత్తిడి పెరుగుతోంది. నిత్యం నిరసనలు వెల్లువెత్తుతున్నాయి.
- గాజాలో ఇజ్రాయిల్ యుద్ధానికి 33 వేల మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. వీరిలో 70 శాతం మంది మహిళలు, చిన్నారులే. ఐరాస వివరాల ప్రకారం.. దాదాపు 17 లక్షల మంది నిరాశ్రయులయ్యారు. స్థానికంగా 56 శాతానికిపైగా భవనాలు ధ్వంసమయ్యాయి. అటు.. లెబనాన్‌లోని హెజ్‌బొల్లాతోపాటు సిరియాలోని ఇరాన్ మద్దతుదారులపైనా నెతన్యాహు సైన్యం అమానవీయ దాడులు చేస్తోంది.
- యుద్ధం మొదట్లో గాజా సరిహద్దులను దిగ్బంధించడంతో.. ఆహారం, ఇంధనం, ఔషధాలు, మంచినీరు, నిత్యావసర సామగ్రి కొరతతో పౌరులు అల్లాడారు. ప్రస్తుతం పరిస్థితులు మరింత దిగజారాయి. ప్రతిఒక్కరూ ఆహారం కోసం ఇబ్బందులు పడుతున్నారని, ఉత్తర ప్రాంతంలో 2 లక్షల మంది విపత్కర పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్నట్లు ఐరాస ఆహార సంస్థ ఆందోళన వ్యక్తంచేసింది.
- ఇజ్రాయిల్ ఒకవేళ రఫాకు దాడులను విస్తరిస్తే.. మొత్తం 23 లక్షల మంది జనాభాలో సగం మంది క్షుద్బాధకు లోనవుతారని ఇటీవల హెచ్చరించింది.
- అంతర్జాతీయ సమాజం ఒత్తిడి మేరకు పాలస్తీనీయన్లకు కొంతమేర మానవతా సాయానికి ఇజ్రాయెల్ ఒప్పుకోవాల్సివచ్చింది. కానీ పదేపదే ఉల్లంఘనలకు పాల్పడుతోంది. దీంతో అరకొర సాయాన్ని కూడా సరిగ్గా చేరవేయలేని దుస్థితి నెలకొందని స్వచ్ఛందసంస్థలు ఆరోపిస్తున్నాయి.
- గాజాకు సముద్రమార్గంలో ఆహార సాయం అందిస్తోన్న 'వరల్డ్ సెంట్రల్ కిచెన్' సిబ్బందిపై ఇటీవల ఇజ్రాయెల్ చేపట్టిన డ్రోన్ దాడిలో ఆరుగురు మతి చెందడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.
- గాజాలో అమాయక పౌరులను చంపడాన్ని నిరసిస్తూ, అమెరికా, ఇజ్రాయిల్ యుద్ధోన్మాదాన్ని ఖండిస్తూ పాలస్తీనియన్లకు మద్దతుగా ఎర్ర సముద్రంలోనూ, గల్ఫ్ ఆఫ్ ఏడెన్‌లోనూ వాణిజ్యనౌకలను మాత్రమే లక్ష్యంగా చేసుకొని యెమెన్‌లోని హూతీ తిరుగుబాటుదారులు దాడులు చేస్తున్నారు. వీరికి ఇరాన్ మద్దతిస్తోంది. వీరిపైనా అమెరికా, బ్రిటన్ సంకీర్ణ సేనలు దాడులు చేస్తున్నాయి.
- దాడులను వెంటనే ఆపాలని అనేక దేశాలు ఇజ్రాయెల్‌ను అంతర్జాతీయ సమాజం పదేపదే డిమాండ్ చేస్తోంది. గాజాలో కాల్పుల విరమణ పాటించాలని ఐరాస భద్రత మండలి, మానవహక్కుల మండలిలు తీర్మానం రూపంలో గొంతెత్తాయి. అయినా కుక్క తోక తరహాలో ఇజ్రాయిల్ తన యుద్ధోన్మాదాన్ని కొనసాగిస్తోంది.
- ఇజ్రాయిల్ యుద్ధ నేరాలపై దక్షిణాఫ్రికా, కొలంబియాలు అంతర్జాతీయ న్యాయస్థానం దష్టికి తీసుకెళ్లాయి. తక్షణమే కాల్పుల విరమణ పాటించాలని అంతర్జాతీయ న్యాయస్థానం కూడా ఉత్తర్వులు జారీ చేసింది.





మీ కోసం

కూరలో పులుపు తక్కువైనట్లు అనిపిస్తే మామిడి పొడి, పెరుగు మిశ్రమాన్ని కలిపితే టమాట రుచి వస్తుంది.

జీవన సౌరభం

ఉన్నత వ్యక్తిత్వాన్ని సంతరించుకునే క్రమంలో ఎదురయ్యే సవాళ్లే జీవిత నిర్మాణంలో పునాది రాళ్లు.

ఆటల కాలం



ఎండాకాలం వచ్చింది
బడికి సెలవు ఇచ్చారు!

ఇది ఆటపాటల కాలం
అల్లరితో చిందులు వేసే కాలం
దోస్తులను దగ్గర చేసే కాలం
ఊ కొడుతూ కథలు చెప్పుకునే కాలం

ఎండాకాలం వచ్చింది
బడికి సెలవు ఇచ్చారు!

ఇష్టమైన కర్బూజా, కొబ్బరి బోండాం
తాటిముంజలు, రాగిజావ
చెరకు రసం, నిమ్మసోడా
చల్లచల్లగా తాగే కాలం ...

ఎండాకాలం వచ్చింది
బడికి సెలవు ఇచ్చారు!

ఇదే మామిడికాయల కాలం
ఆవకాయల ఘుమఘుమల కాలం
కాయలు తియ్యని పండుగా మారే కాలం
ఆనందంతో లొట్టలు వేసే కాలం

ఎండాకాలం వచ్చింది
బడికి సెలవు ఇచ్చారు!


కోయిల రాగాలను వినిపించే కాలం
బొండు మల్లెల, సన్నజాజుల
పరిమళాల పలకరింపుల కాలం
ఎండను మరిపించే కాలం

ఎండాకాలం తిరుగు ప్రయాణమైంది
వర్షాకాలం మొదలైంది!

నల్లని మబ్బుల ఆకాశం
చిటపట చినుకుల
ఆటలు ఆడేస్తోంది
బడిగంట గణగణమంటూ పిలుస్తోంది!

ఇక కొత్త పుస్తకాల కాలం వచ్చింది
ఇది పై తరగతులకు ఎగిరే కాలం!

- డా. నీరజ అమరవాది,
98491 60055.



లెక్క చేయండి

పిల్లలూ, ఇక్కడ కనిపిస్తున్న బొమ్మలను అంకెలుగా గణించి లెక్క చేశాం. చివరి వరుస సమాధానం మీరు రాబట్టండి చూద్దాం.

జవాబు : 35

నేను గీసిన బొమ్మ



కాటూరి సాత్విక,
4వ తరగతి,
ఎం.పి.పి.ఎస్, వానపాముల (హెచ్.డబ్ల్యు),
పెద పారుపూడి మండలం,
కృష్ణా జిల్లా.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com



జీవితం ఏ ఒక్కరికీ వడ్డించిన విస్తరి కాదు. వచ్చిన ఆటుపోట్లను ఎదుర్కొంటూ ధైర్యంగా ముందుకు సాగటమే మార్గం. ఆ మార్గంలో ఎదురయ్యే అవరోధాలను అధిగమిస్తూ ముందుకు సాగితే ఎంచుకున్న లక్ష్యాన్ని సాధించొచ్చు. మహిళలు కూడా ఆర్థిక స్వావలంబన సాధించాలనీ, వారి కాళ్లపై వారు నిలబడేలా చేయాలని కంకణం కట్టుకుని నెరవేర్చిన ఘనత సరబ్జీత్ కౌర్‌కు దక్కుతుంది. ఆమె అందరి లాగా నడిచే స్థితిలో లేదు. పోలియో కారణంగా రెండు కాళ్లూ పనిచేయవు. చేతికర్రల సాయంతోనే ఆమె నడవగలరు. అయితేనేం... ఆమె ఎంచుకున్న స్వయం ఉపాధి రంగంలో నిపుణత ద్వారా ఆర్థిక స్వావలంబన సాధించారు. మరెందరో మహిళలకు ఉపాధి అవకాశాలు చూపుతూ ముందుకు సాగుతున్నారు.

ఆటంకాలను అధిగమించి...

పంజాబ్ జిల్లా భటిండా జిల్లా సేఖు గ్రామానికి చెందిన సరబ్జీత్ కౌర్ (44). పుట్టుకతో వికలాంగురాలు. తల్లిదండ్రులు ఎంతో ఆవేదన చెందారు. ఎలా పెంచి పెద్ద చేయాలో అని ఆవేదనకు గురయ్యారు. తరువాత సర్దుకొని, ధైర్యం తెచ్చుకొని, బిడ్డను సాకారు. చదివించారు. కుట్టు శిక్షణ ఇప్పించారు. కాళ్లు లేకపోయినా చేతులు, కర్ర సాయంతో కుట్టు మిషను నడపగలుగుతారు. తల్లిదండ్రులకు చేదోడు వాదోడుగా ఉంటూ బట్టలు కుట్టడం ద్వారా కొంతమేర సంపాదించగల్గుతున్నారు. శరీరం వికలాంగత్వంతో ఉందని ఆమె ఏ రోజూ బాధపడలేదు. తనలో ఉన్న సామర్థ్యాన్ని వెలికితీస్తే ఖచ్చితంగా విజయం సాధిస్తానని తాను నమ్మింది. జీవితంలో కష్టపడి ఎదగాలని భావించింది. ఎంబ్రాయిడరీతో పాటుగా, ఎలక్ట్రికల్ మిషన్‌పై వర్కు నేర్చుకుంది. 'నువ్వు చెయ్యగలవా' అంటూ చుట్టుపక్కల వారు సందేహించారు. కానీ, సరబ్జీత్ తనను తాను మెరుగుపర్చుకోవటానికి, తన శక్తి సామర్థ్యాలను ప్రదర్శించటానికి నిరంతరం కృషి చేసింది.



ఈ క్రమంలో ఆమెకు సోన్‌పాల్ అనే వికలాంగుడితో తల్లిదండ్రులు వివాహం జరిపించారు. కుటుంబ పోషణ నిమిత్తం భార్యభర్తలు ఇద్దరూ కుట్టుమిషన్ ద్వారా దుస్తులు కుడుతూ వచ్చిన ఆదాయంతో జీవనోపాధి పొందటం మొదలు పెట్టారు. 2017లో హెచ్‌పిసిఎల్- మిట్టల్ ఎనర్జీ లిమిటెడ్ (హెచ్ఎంఇఎల్) ఎన్‌జిఒ ఆధ్వర్యంలో గ్రామంలోని స్వయం సహాయక బృందాలు (ఎస్‌హెచ్‌జి) ఏర్పాటు చేస్తే ప్రభుత్వం నుంచి ఆర్థిక చేయూత అందుతుందని నిర్వాహకులు ప్రకటించారు. గ్రామంలో ఏర్పాటుచేసిన సమావేశంలో కొత్తగా ఎస్‌హెచ్‌జి ఏర్పాటు,



నాయకత్వంలోకి ఎవ్వరూ ముందుకు రావటం లేదు. అప్పుడు కౌర్ తనే ముందుకు రావటంతో మరో 9 మంది సభ్యులుగా చేరటానికి అంగీకరించారు. గురు రవిదాస్ స్వయం సహాయ సంఘం ఏర్పాటు చేశారు. సభ్యులు కొంత పొదుపు చేస్తే ప్రభుత్వం కొంత ఆర్థిక సహాయం చేస్తుందనటంతో సంఘ సభ్యులు ఒక్కొక్కరు రూ.100 చొప్పున పొదుపు చేపట్టారు. ఆ తర్వాత ప్రభుత్వం నుంచి రూ.15 వేలు చొప్పున రివాల్వింగ్ ఫండ్‌గా మంజూరైంది. తద్వారా గ్రూపులోని మిగతా సభ్యులు కూడా కుట్టుమిషన్లు కొనుక్కోగలిగారు. అప్పటికే తమ ఇంట్లో కౌర్ దంపతులు ఇద్దరూ కుట్టు పని చేస్తున్నారు. వారు ఆ మహిళలకు శిక్షణ ఇవ్వటానికి పూనుకున్నారు. తరువాత మరింతమంది మహిళలు చేరటంతో గ్రూపుల సంఖ్య కూడా పెరిగింది. కౌర్‌గ్రామంలోని అన్ని ప్రాంతాలకు వెళ్లి మహిళలను శిక్షణకు ప్రోత్సహించింది. చుట్టుపక్కల గ్రామాల నుంచి కూడా మహిళలను సమీకరించి మరో 29 ఎస్‌హెచ్‌జి గ్రూపులు ఏర్పాటు చేయటం ద్వారా నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసింది. కుట్టు పని నుంచి బేకరీ, డెయిరీ యూనిట్లు, బంగాళాదుంప, అరటి చిప్స్, పచ్చళ్ల ప్యాకింగ్, వాటర్ ఆర్ఒ ప్లాంట్ల ఏర్పాటుకు ప్రోత్సహిస్తున్నారు. తద్వారా మహిళలు వాటిలో నైపుణ్యాన్ని పెంపొందించుకుని జీవనోపాధికి మార్గాన్ని ఎంచుకుని ఆర్థికంగా ఎదుగుతున్నారు. కౌర్ చేస్తున్న కృషితో మిగతా మహిళలు కూడా ఈ తరహాలో ఏదో ఒక నైపుణ్యాన్ని పెంపొందింపజేసుకోవాలని నిర్ణయించుకుంటున్నారు.


ఇ-బైక్ సహాయంతో ...

కౌర్ చేస్తున్న కృషిని గమనించిన హెచ్ఎంఇఎల్ ప్రతినిధులు ఆమెకు ఇ.-స్కూటర్‌ను అందజేశారు. ఆమె ప్రతిరోజూ గ్రామంతోపాటు ఇతర ప్రాంతాలకు ఈ బైక్‌పై వెళ్లి అక్కడి మహిళలతో సమావేశాలు ఏర్పాటు చేసి ఎస్‌హెచ్‌జి గ్రూపులు ఏర్పాటు చేయటం, తద్వారా ప్రభుత్వం నుంచి సహాయం అందేలా చేయటాన్ని దిన చర్యగా మార్చుకున్నారు.

మహిళలకు స్ఫూర్తిగా...

నైపుణ్య శిక్షణ అందించటమే కాకుండా యూనిట్ల ఏర్పాటు వరకూ ఆమే దగ్గరుండి ప్రోత్సహిస్తుండటంతో నిరుపేద మహిళలు, వితంతువులు, వృద్ధ మహిళలు అనేకమంది ఆ గ్రూపుల్లో చేరారు. శానిటరీ ప్యాడ్ల ఉత్పత్తి నుంచి ఆర్ఒ సిస్టమ్‌ల నిర్వహణ వరకూ వ్యాపారాలు, స్థానిక అవసరాలకు మాత్రమే కాకుండా ఉపాధి అవకాశాలను కూడా ఆయా గ్రూపులు నడుపుతున్నాయి. కౌర్ ఒక సాధారణ మహిళ నుంచి కమ్యూనిటీ కోఆర్డినేటర్‌గా ఎదిగారు.

వైకల్యం అనేది ఎదుగుదలకు అసౌకర్యమే కానీ ఆటంకం కాదనీ ఆమె నిరూపించింది. సాటి మహిళలకు ఎంతో స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది.



మే 24న ఇండియన్-2 విడుదల

శంకర్ దర్శకత్వంలో కమల్ హాసన్ నటిస్తున్న చిత్రం 'ఇండియన్-2'. కొన్నేళ్లుగా చిత్రీకరణ జరుపుకుంటూ వచ్చిన ఈ సినిమా ఎట్టకేలకు విడుదలకు సిద్ధమైంది. సమ్మర్ స్పెషల్‌గా మే 24న ఈ సినిమా విడుదల కానుంది. ఇందులో కమల్‌తోపాటు కాజల్ అగర్వాల్, రకుల్‌ప్రీత్ సింగ్, సిద్ధార్థ్, సముద్ర ఖని, బాబీ సింహా తదితరులు నటించారు. ఈ సినిమా తొలి భాగానికి ఎఆర్ రెహ్మాన్ సంగీతాన్ని అందించగా, రెండో భాగానికి అనిరుధ్ రవిచంద్రన్ సంగీత స్వరాలు సమకూర్చారు. తుది దశ నిర్మాణ పనులు పూర్తి చేసుకున్న ఈ మూవీని సమ్మర్ స్పెషల్‌గా తమిళం, తెలుగు, హిందీ, కన్నడ భాషల్లో విడుదల చేయనున్నారు.


త్వరలో కీరవాణి తనయుడి వివాహం




ఆస్కార్ అవార్డు గ్రహీత ఎంఎం కీరవాణి తనయుడు, హీరో శ్రీసింహాతో నటుడు మురళీ మోహన్ మనవరాలు రాగ పెళ్లి జరగనుంది. ఇరు కుటుంబాలు ఈ మేరకు అంగీకరించాయని ఇటీవలే మురళీమోహన్ ప్రకటించిన విషయం తెలిసిందే.

తాజాగా ఓ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో రూప మాట్లాడుతూ, ఈ ఏడాది చివర్లో పెళ్లి జరుగుతుందని ప్రకటించారు. మురళీమోహన్‌కు కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమార్తె విదేశాల్లో స్థిరపడ్డారు. కుమారుడు రామ్మోహన్ ఆయనకు సంబంధించిన వ్యాపారాలను చూసుకుంటున్నారు. రామ్మోహన్- రూపల కుమార్తె రాగ. విదేశాల్లో ఆమె బిజినెస్‌లో మాస్టర్స్ పూర్తిచేసింది. ప్రస్తుతం రాగ కూడా తన కుటుంబానికి సంబంధించిన వ్యాపార వ్యవహారాలు చూసుకుంటున్నారు. శ్రీసింహ యమదొంగ సినిమాలో చైల్డ్ ఆర్టిస్ట్‌గా నటించారు. మత్తు వదలరా సినిమాతో హీరోగా మారాడు. తెల్లవారితే గురువారం, దొంగలున్నారు జాగ్రత్త, ఉస్తాద్ సినిమాలతో టాలీవుడ్‌లో హీరోగా నిలదొక్కునే ప్రయత్నం చేస్తున్నాడు. కీరవాణి పెద్దబ్బాయి కాలభైరవకు ఇంకా పెళ్లి కాలేదు.

'సీతా కళ్యాణ వైభోగమే' ఫస్ట్ లుక్ విడుదల



సుమన్‌తేజ్, గరీమచౌహన్ హీరో హీరోయిన్లుగా నటించిన తాజా చిత్రం 'కళ్యాణ వైభోగమే'. డ్రీమ్‌గేట్ ప్రొడక్షన్స్ పతాకంపై సతీష్ పరమవేద దర్శకత్వంలో రాచాల యుగంధర్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. భారీ యాక్షన్స్ ఎపిసోడ్స్‌తోపాటు మంచి ఫ్యామిలీ ఎమోషన్స్‌తో ఈ చిత్రం రాబోతుందని మేకర్స్ ఇటీవల ప్రకటించారు. గోవాలో కొరియోగ్రాఫర్ భాను మాస్టర్ నేతృత్వంలో దాదాపు 250 మంది డ్యాన్సర్లతో ఈ చిత్రంలోని ఓ పాటను చిత్రీకరించారు. ఫస్ట్‌లుక్‌ను శనివారంనాడు మేకర్స్ విడుదల చేశారు. గగన్ విహారి విలన్‌గా నటిస్తున్నారు. నాగినీడు, శివాజీ రాజా, ప్రభావతి, వెంకీ మంకీ ఇతర ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. సంగీత దర్శకుడు చరణ్ అర్జున్, కెమెరామెన్ పరశురామ్, ఎడిటర్ డి.వెంకట్‌ప్రభు, ఫైట్‌మాస్టర్ డ్రాగన్ ప్రకాష్, కొరియోగ్రాఫర్లు భాను మాస్టర్, పోలంకి విజయ్ పనిచేస్తున్నారు.



అశోక్ గల్లా ఆర్థిక సహాయం

యువ కథానాయకుడు అశోక్ గల్లా తెలుగు డిఎంఎఫ్‌లో చేరిన తీవ్రమైన ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతున్న మీమర్‌కు రూ.2 లక్షలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. తన పుట్టినరోజును పురస్కరించుకుని ఆయన ఈ సాయాన్ని చేశారు.

'మిస్ జానకి' షూటింగ్ ప్రారంభం

ఎస్ఎన్ చాందిని క్రియేషన్స్ బ్యానర్‌పై నాగరాజు నెక్కంటి నిర్మాణ సారథ్యంలో బిగ్‌బాస్ ఫేమ్ అశ్విని శ్రీ ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం మిస్ జానకి. సతీష్‌కుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. సి.కళ్యాణ్ క్లాప్ కొట్టి సినిమాను ప్రారంభించారు. అనంతరం నటుడు మహేష్‌కుమార్ మాట్లాడుతూ ఈనెల 20 నుంచి ఏకధాటిగా 30 రోజులు రెగ్యులర్ షూటింగ్ జరుగుతుందన్నారు. ఆ తర్వాత మరో షెడ్యూల్‌తో షూటింగ్‌ను పూర్తిచేస్తామన్నారు. అశ్వినిశ్రీ మాట్లాడుతూ లేడీ ఓరియెంటెడ్‌గా ఈ సినిమా ఉంటుందన్నారు.

11న డియర్ విడుదల



నటుడు, సంగీత దర్శకుడు జీవీ ప్రకాష్‌కుమార్, నటి ఐశ్వర్య రాజేష్ జంటగా నటించిన చిత్రం డియర్. నటి రోహిణి, ఇళవరసు, తలైవాసల్ విజయ్ తదితరులు ముఖ్యపాత్రలు పోషించారు. నట్‌మగ్ ప్రొడక్షన్స్ పతాకంపై వరుణ్ త్రిపురనేని, అభిషేక్ రామిశెట్టి, జి.పృథ్వీరాజ్ కలిసి నటించారు. ఆనంద్ రవిచంద్రన్ దర్శకత్వం వహించారు. జీవీ ప్రకాష్ కుమార్ సంగీతాన్ని అందించారు. నిర్మాణ కార్యక్రమాలను పూర్తిచేసుకుని ఈనెల 11న ఈ సినిమా విడుదల కానుంది. టీమిండియా క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ ఈ సినిమాలో నటించారు. తమిళంలో వస్తున్న 'డియర్'లో అతిథి పాత్రలో నటించారు. ఈ సినిమా ట్రైలర్ కూడా ఇటీవల విడుదలైన విషయం తెలిసిందే.

బాదేసిన బట్లర్, సంజు

- బెంగళూరుపై రాజస్తాన్ ఘన విజయం
- కోహ్లి రికార్డు సెంచరీ వృధా

జైపూర్: ఐపిఎల్ చరిత్రలో విరాట్ కోహ్లి రికార్డు సెంచరీతో మెరిసినా.. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు ఓటమి తప్పలేదు. సవాయ్ మాన్‌సింగ్ స్టేడియంలో శనివారం రాజస్తాన్ రాయల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో బెంగళూరు జట్టు ఆరు వికెట్ల తేడాతో ఘోర పరాజయాన్ని చవి చూసింది. తొలుత కోహ్లి(113) సెంచరీకి తోడు మరో ఓపెనర్ డుప్లెసిస్(44) రాణించడంతో బెంగళూరు జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 3వికెట్ల నష్టానికి 183 పరుగులు చేసింది. ఆ లక్ష్యాన్ని రాజస్తాన్ జట్టు 19.1ఓవర్లలో 4వికెట్ల నష్టానికి 189పరుగులు చేసి ఛేదించింది. రాజస్తాన్ ఓపెనర్ జోస్ బట్లర్ (100నాటౌట్; 58బంతుల్లో 9ఫోర్లు, 4సిక్సర్లు), సంజు(69; 42బంతుల్లో 8ఫోర్లు, 2 సిక్సర్లు) కీలకపాత్ర పోషించారు. తొలుత బెంగళూరుకు తొలి వికెట్‌కు కోహ్లి-డుప్లెసిస్ 14ఓవర్లలో 125 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఆ తర్వాత సౌరవ్ చౌహాన్(9)తో కలిసి కోహ్లి స్కోర్‌ను 150 పరుగులు దాటించాడు. అనంతరం బర్గర్ వేసిన 19వ ఓవర్ నాలుగో బంతికి సింగిల్ తీసిన విరాట్ కోహ్లి ఐపిఎల్‌లో 8వ సెంచరీ కొట్టి రికార్డు నెలకొల్పాడు. విరాట్ కోహ్లి 67 బంతుల్లో 9ఫోర్లు, 4సిక్సర్ల సాయంతో సెంచరీ చేశాడు. రాజస్తాన్ బౌలర్లలో చాహల్‌కు రెండు, బర్గర్ ఒక వికెట్ దక్కాయి. ఛేదనలో రాజస్తాన్ యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్(0) నిరాశపరిచినా.. మరో ఓపెనర్ బట్లర్(100నాటౌట్) ఆకాశమే హద్దుగా చెలరేగి ఆడాడు. మరో ఎండ్‌లో కెప్టెన్ సంజు శాంసన్(69) కూడా కదం తొక్కారు. వీరిద్దరూ 2వ వికెట్‌కు ఏకంగా 148పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పి రాజస్తాన్ గెలుపుకు దోహదపడ్డారు. రియాన్ పరాగ్ (4), ధృవ్ జురెల్ (2) నిరాశపరిచినా.. హెట్‌మైర్ (11) మరో వికెట్ పడకుండా మ్యాచ్ ముగించాడు. బెంగళూరు బౌలర్లు టోప్లేకు రెండు, యశ్ దయాల్, సిరాజ్‌కు ఒక్కో వికెట్ దక్కాయి. ఈ విజయంతో రాజస్తా న్ జట్టు టాప్‌లోకి దూసుకెళ్లింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ బట్లర్‌కు దక్కింది.



ఐపిఎల్‌లో అత్యధిక సెంచరీలు కొట్టిన ఆటగాళ్లు

విరాట్ కోహ్లి	8
క్రిస్ గేల్	6
జోస్ బట్లర్	6
కేఎల్ రాహుల్	4
డేవిడ్ వార్నర్	4
షేన్ వాట్సన్	4

మోంటేకార్లో మెయిన్ డ్రాకు చేరువలో సుమిత్

మోంటేకార్లో(మొరాకో): మోంటేకార్లో మాస్టర్స్ క్వాలిఫికేషన్ టోర్నీలో భారత స్టార్ టెన్నిస్ ఆటగాడు సుమిత్ నాగల్ సంచలనం నమోదు చేశాడు. శనివారం జరిగిన తొలిరౌండ్ పోటీలో ప్రపంచ 63వ ర్యాంకర్, ఇటలీకి చెందిన ఫ్లావియో కొబొల్లిపై వరుససెట్లలో విజయం సాధించాడు. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 95వ స్థానంలో ఉన్న సుమిత్.. ఈ టోర్నీలో 8వ సీడ్‌గా బరిలో దిగాడు. ఏకపక్షంగా సాగిన ఈ మ్యాచ్‌లో సుమిత్.. 6-2, 6-3తేడాతో కొబొల్లిను చిత్తుచేశాడు. ప్రధాన టోర్నీకి అర్హత సాధించేందుకు క్వాలిఫికేషన్ టోర్నీ నుంచి ఏడుగురు అర్హత సాధించనున్నారు. 2వ రౌండ్‌లో సుమిత్ కజకిస్తాన్‌కు చెందిన అలెగ్జాండర్ బబ్లిక్‌తో తలపడనున్నాడు.

3వ ర్యాంకర్‌కు విదిత్ చెక్



టొరంటో: విదిత్ గుజరాతి ప్రపంచ 3వ ర్యాంకర్ హికారు నకముర(అమెరికా)పై రెండోరౌండ్‌లో గెలిచాడు. కేవలం 29ఎత్తుల్లోనే విదిత్ టాప్‌ర్యాంక్ ఆటగానికి చెక్ పెట్టడం విశేషం. ఈ మ్యాచ్ కేవలం 47నిమిషాల్లోనే ముగిసింది. 2వ రౌండ్ ముగిసిన అనంతరం కరునా, గుకేశ్, నెపొంనెచ్చి, విదిత్ 1.5పాయింట్లతో టాప్‌లో ఉండగా.. అభసోవ్, ఫోజియా, నకముర, ప్రజ్ఞానంద 0.5పాయింట్‌తో ఆ తర్వాతి స్థానంలో ఉన్నారు. ఇక మహిళల విభాగంలో టాన్జోవీ, గోయక్చినియా 1.5పాయింట్లతో అగ్రస్థానంలో ఉండగా.. కోనేరు హంపి, సలీమోవా, లంగ్నో ఒక పాయింట్‌తో రెండోస్థానంలో కొనసాగుతున్నారు.

భారత హాకీ జట్టుకు తప్పని ఓటమి

ఆస్ట్రేలియా చేతిలో 1-5గోల్స్‌తో చిత్తు

పెర్త్: పారిస్ ఒలింపిక్స్‌కు ముందు ఆస్ట్రేలియాతో జరుగుతున్న టెస్ట్ సిరీస్ తొలి మ్యాచ్‌లోనే భారత్ ఓటమిపాలైంది. పటిష్ట ఆస్ట్రేలియాతో పోరుకు సిద్ధమైన భారత్.. శనివారం జరిగిన తొలి మ్యాచ్‌లో 1-5గోల్స్ తేడాతో ఆతిథ్య ఆసీస్ చేతిలో ఓడింది. ఆస్ట్రేలియా తరపున బ్రాండ్(3వ ని.), విక్‌హామ్(20వ, 38వ ని.)లో రెండు గోల్స్ కొట్టారు. ఇక రింటల(37వ ని.), పెనాల్టీ స్ట్రోక్‌ను ఓజిల్వీ(57వ ని.)లో గోల్స్ చేశారు. భారత్ తరపున ఏకైక గోల్‌ను గుర్జన్ సింగ్(47వ ని.)లో చేశాడు. ఆసీస్ ఆటగాళ్లు ప్రతి క్వార్టర్‌లోనూ భారత్‌పై ఆధిపత్యం సంపాదించారు. దీంతో ఐదు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్ 0-1తో వెనుకబడింది. రెండో మ్యాచ్ ఏప్రిల్ 7(ఆది)న జరగనుంది. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో భారత్ నాల్గవ, ఆస్ట్రేలియా ఐదవ స్థానాల్లో ఉన్నాయి.

సింగిల్స్ విజేత అనుపమ, తరణ్

కజకిస్తాన్ ఇంటర్నేషనల్ ఛాలెంజ్



అస్తనా(కజకిస్తాన్): కజకిస్తాన్ ఇంటర్నేషనల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ సింగిల్స్ టైటిళ్లను భారత్‌కు చెందిన అనుపమ ఉపాధ్యాయ, ఎం. తరుణ్ చేజిక్కించుకున్నారు. శనివారం జరిగిన మహిళల సింగిల్స్ ఫైనల్లో అనుపమ 21-15, 21-16తో కేవలం 41వ నిమిషాల్లోనే ఇషారాణి బరూహ్(తజకిస్తాన్)ను చిత్తుచేసింది. ఇక పురుషుల సింగిల్స్ ఫైనల్లో ఎం. తరుణ్ 21-10, 21-19తో మలేషియాకు చెందిన సూంగ్-జూ-వెన్‌ను చిత్తుచేశాడు.

ఐపిఎల్‌లో నేడు

ముంబయి × ఢిల్లీ
వేదిక: ముంబయి; మ.3.30గం॥లకు

లక్నో × గుజరాత్
వేదిక: లక్నో; రా.7.30గం॥లకు

పాయింట్ల పట్టిక

జట్టు	మ్యా	గె	ఓ	పా	నె.ర.
కోల్‌కతా	3	3	0	6	2.51
రాజస్తాన్	3	3	0	6	1.24
చెన్నై	3	2	1	4	0.97
లక్నో	3	2	1	4	0.48
పంజాబ్‌కింగ్స్	4	2	2	4	-0.22
గుజరాత్	4	2	2	4	-0.58
సన్‌రైజర్స్	3	1	2	2	0.20
బెంగళూరు	4	1	3	2	-0.87
ఢిల్లీ క్యాపిటల్స్	4	1	3	2	-1.34
ముంబయి	3	0	3	0	-1.42

మ్యా:మ్యాచ్‌లు; గె:గెలుపు; ఓ:ఓటమి; పా:పాయింట్లు; నె.ర.:నెట్‌రన్‌రేట్

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68